

గురువారం 25 డిసెంబర్ 2025


## రక్షణ చట్టాలపై తప్పనిసరిగా అవగాహన ఉండాలి

కడప క్రైం, డిసెంబరు 24, ప్రభాతవార్త:



జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు కడపలోని బాలాజీ ఒకేషనల్ జూనియర్ కాలేజీలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. సమాజంలో జరుగుతున్న నేరాలు, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలు, సైబర్ మోసాలు, రహదారి భద్రత నియమాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థి దశలో చదువుతో పాటు సమాజంలో జరుగుతున్న సంఘటనలను గమనిస్తూ చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఆడపిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలను ధైర్యంగా ఎదుర్కొని, అవసరమైనప్పుడు పోలీసుల సహాయం ఎలా పొందాలో వివరించారు. మొబైల్ ఫోన్ వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని మాయ మాటలు, ప్రలోభాలకు లోనుకాకూడదన్నారు. సైబర్ మోసాలకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. మహిళల భద్రతపై అవగాహన పెంపొందిస్తూ అత్యవసర పరిస్థితుల్లో డబుల్ 112, సైబర్ నేరాలకు 1930 ద్వారా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. మహిళల భద్రత కోసం ఏర్పాటు చేసిన శక్తి టీం, వారి విధులు, సేవలపై విద్యార్థులకు వివరించారు.

## జిల్లా ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు

### జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్.

రాయచోటి, డిసెంబర్ 24 ప్రభాత వార్త



అన్నమయ్య జిల్లా కలెక్టరేట్లో నిర్వహించిన జిల్లా స్థాయి క్రిస్మస్ హైటి కార్యక్రమం ప్రజలందరిలో సంతోషం, ఉత్సాహాన్ని కలిగించిందని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆవరణంలో ఘనంగా క్రిస్మస్ హైటి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజలందరూ దైనందిక జీవితంలో మానసిక ఒత్తిడికి కూడిన పని వాతావరణంలో ఇలాంటి హైటి కార్యక్రమాలు ఉద్యోగులు, అధికారులకు ప్రజలకు మానసికంగా మంచి ఉత్సాహాన్ని, ఆనందాన్ని కలిగిస్తాయని, మత భేదాలు లేకుండా అందరికీ ఉత్సాహం, స్ఫూర్తిని అందించే పండుగగా క్రిస్మస్ అని పేర్కొన్నారు. చిన్న పిల్లల నుండి పెద్దల వరకు అందరూ ఎంతో ఆత్రుతతో ఎదురు చూసే పండుగ క్రిస్మస్ అని, ఈ పండుగతో ప్రారంభమై సంక్రాంతి వరకు రాష్ట్రంలో అన్ని మతాలకు చెందిన ప్రజలు పండుగ వాతావరణంలో తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా వేడుకలు జరుపుకుంటారని చెప్పారు. ఈ క్రిస్మస్ పండుగతో సీజన్ ప్రారంభమైందని పేర్కొన్నారు.

# చట్టాలు, హక్కులపై వినియోగదారులు అవగాహన పెంచుకోవాలి

కడప, డిసెంబర్ 24 ప్రభాతవార్త :





వినియోగదారులు వారి చట్టాలపై అవగాహన పెంచుకొని అమ్మకాలలో జరుగుతున్న మోసాలను అరికట్టాలని డిఆర్వో విశ్వేశ్వర నాయుడు పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం కడప నగరంలోని గాంధీనగర్ నగర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జాతీయ వినియోగదారుల దినోత్సవం 2025 జిల్లాస్థాయి వేడుకల్లో భాగంగా.. జిల్లా వినియోగదారుల వ్యవహారాలు, ఆహార పౌరసరఫరాల శాఖల సంయుక్త ఆధ్వర్యంలో డిజిటల్ న్యాయ పాలన ద్వారా సమర్థ, సత్వర పరిష్కారంఖీ అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డిఆర్వో మాట్లాడుతూ.. ప్రతి ఏడాది డిసెంబర్ 24వ తేదీన నిర్వహించే జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా ఈ రోజు "డిజిటల్ న్యాయ పాలన ద్వారా సమర్థ, సత్వర పరిష్కారం" అంశంపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడమైనదన్నారు. వినియోగదారులు ఎంతో కష్టపడి కొన్న వస్తువు నాణ్యత లోపిస్తే వారు ఎంత మనస్తాపానికి గురవుతారో గ్రహించి.. ఆ ధోరణిలో మోసాలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. దైనందిన జీవితంలో ఉపయోగించే ప్రతి ఒక్క వస్తువుపైన వినియోగదారుడికి చట్టపరమైన హక్కును ప్రభుత్వం కల్పించిందన్నారు. 1986లో రూపు దిద్దుకున్న వినియోగదారుల చట్టాన్ని.. కేంద్ర ప్రభుత్వం మరింత సమర్థవంతంగా "వినియోగదారుల రక్షణ చట్టం 2019"గా.. మార్పు చేయడం జరిగిందన్నారు. ఈ మార్పు చెందిన చట్టం 2020 సంవత్సర ఆరంభం నుండి అన్ని రాష్ట్రాల్లో అమలులోకి వచ్చిందన్నారు. వినియోగదారులు తమ హక్కుల పట్ల ఎప్పటికప్పుడూ అవగాహన పెంచుకోవాలని డిఆర్వో సూచించారు. జిల్లా వినియోగదారుల కమిషన్ చైర్మన్ జి.ఎం. బి. మురళీకృష్ణ మాట్లాడుతూ.. ప్రస్తుతం జిల్లా కోర్టుకంటే వినియోగదారుల చట్టం ముందు ఎన్నో ఫిర్యాదులు వస్తున్నాయంటే... వినియోగదారుల అవసరాలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుస్తోందన్నారు. వినియోగదారుల సౌలభ్యం, సమయాన్ని పరిగణలోకి తీసుకుని... ప్రభుత్వం వర్చువల్ విధానంలో విచారణ, అలాగే డిజిటల్ పద్ధతిలో సులభతరంగా ఫోరంకు నేరుగా ఫిర్యాదు చేసే సదుపాయాన్ని కల్పించనుందన్నారు. తేదీ. 06, 11. 2020న అన్ని కోర్టులు వర్చువల్ మోడ్ కి మారడానికి అనుమతించాలని, డిజిటల్ కోర్టులకు చట్టబద్ధత కల్పిస్తూ ఆర్టికల్ 142 క్రింద సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ ఆచేసిందన్నారు. అందుకు తగిన విధంగా మార్గదర్శకాలను కూడా విడుదల చేసిందని.. ఆ మేరకు వర్చువల్ హియరింగ్ విధానం ద్వారా కలిగే ప్రయోజనాలను డీఆర్వో వివరించారు. లీగల్ మెటరాలజీ అసిస్టెంట్ కమిషనర్ రమేష్ రెడ్డి మాట్లాడుతూ.. 2024 లో అమలులోకి వచ్చిన యూనిట్ సేల్ ప్రైస్ చట్టం.. ద్వారా కొలతలు, తూకాల్లో వచ్చే తేడాలు జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉంటూ అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రస్తుత కాలంలో వ్యాపారం విస్తృతం అవుతున్న నేపథ్యంలో చాలావరకు మోసం కూడా చొరబడుతోందని, ఇలాంటి సమయంలో వినియోగదారులుగా మనమే జాగ్రత్త పడి.. చట్టాల పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రజలను చైతన్య పరచడంలో మీడియా ప్రముఖ పాత్ర వహిస్తోందండని తెలిపారు. కావున మీడియా ద్వారా కూడా అవగాహన పెంచుకోవాలన్నారు. ఆహార కల్తీ నిరోధక శాఖ జిల్లా ఇంచార్జి అధికారి రామచంద్ర మాట్లాడుతూ దైనందిన జీవితంలో ప్రతి ఒక్కరూ వ్యాపారి వద్ద ఏదో ఒక వస్తువు కొనాల్సిన అవసరం ఉంటుంది కావున.. మనం కొనే వస్తువు యొక్క స్థితిని గమనించడం మన బాధ్యత అన్నారు. వస్తువు తయారీ తేదీ, గడువు ముగింపు తేదీ, వస్తువు నాణ్యత ప్రమాణాలు, రుచి, వాసన తదితర వస్తువు యొక్క స్థితిని గమనించాలని తెలిపారు. ఏమైనా తేడాలు గమనించినట్లయితే వెంటనే వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేయవచ్చాన్నారు. వీటన్నింటికంటే ముందుగా కొన్న ప్రతి వస్తువును బిల్లును స్వీకరించాలన్నారు. ముఖ్యంగా ఫుడ్ కలర్స్ లేని ఆహారాన్ని మాత్రమే.. ప్రజలు వియోగించాలని, ఫ్లేవర్ ఎన్ హేన్స్ (వాసనతో ఆకర్షించే)లను వినియోగించే పదార్థాలను వాడకపోవడం మంచిదన్నారు. పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి రఘురామ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం వర్తక వ్యాపారాల్లో వినియోగ దారుడు చాలా విధాలుగా నష్టపోతున్నామని చెప్పవచ్చున్నారు. వినియోగదారులుగా మనం కొనే వస్తువుపై మనకు పూర్తి స్థాయి హక్కు ఉందని తెలిపారు. ఎంఆర్పి రేటుకంటే అధిక ధరకు వస్తువును అమ్మితే వెంటనే కన్స్యూమర్ ఫోరమ్ కు ఒక్క కాల్ చేస్తే వస్తువు అమ్మకంలో ఎలాంటి మోసాన్ని అయినా అరికట్టవచ్చున్నారు. అందుకోసం ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. జిల్లా పరిశ్రమల శాఖ జీఎం చాంద్ భాషా మాట్లాడుతూ కొన్న ప్రతి వస్తువు పైన లేబుల్ డిస్కో ఉందా లేదా అని చూసుకుని కొనలన్నారు. అంతేకాకుండా మన చుట్టూ వున్న పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు ద్వారా ఏవైనా నాణ్యత.లోపాలు, కాలుష్య భరితమైన ఉత్పత్తి అవుతుంటే వాటిపై కూడా వినియోగదారులు ఫోరమ్కు వేసే అవకాశం ఉందన్నారు. అనంతరం జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం కన్వీనర్ కమ్ అడ్వైజర్ పి.రమేష్ మాట్లాడుతూ.. వినియోగదారులు సాధారణ వస్తువులతో పాటు, ఆహార వస్తువుల విషయంలో కూడా తగు జాగ్రత్తలు నిర్వహించాలని సూచించారు. మన హక్కులను కాపాడుకోవడం మన ప్రధాన బాధ్యత అని అందుకు సంబంధించి పలు ఉదాహరణలతో అవగాహన కల్పించారు. అనంతరం వినియోగదారు న్యాయపాలనకు వర్చువల్ విచారణలు మరియు డిజిటల్ సౌలభ్యంఖీ అనే అంశంపై జిల్లాలోని పలు విద్యా సంస్థల్లో నిర్వహించిన, వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ముఖ్య అతిధులు బహుమతులను, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫుడ్ ఇన్స్పెక్టర్ హరిత, పాఠశాల ఉపాధ్యాయులు, ఔషధ నియంత్రణ శాఖ, ఎపి వినియోగదారుల ఫోరం జిల్లా సభ్యులు, బార్ అసోసియేషన్ సభ్యులు, పౌర సరఫరాల డీలర్లు, విద్యార్థులు తదితరులు హాజరయ్యారు.

## రాజంపేట సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏజీపిగా ఛాయాదేవి

రాజంపేట, డిసెంబర్ 24 ప్రభాతవార్త

రాజంపేట సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ గా రాజంపేట బార్ అసోసియేషన్ లో న్యాయవాదిగా ఉన్న ఛాయాదేవిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర లీగల్ విభాగం రాష్ట్ర కార్యదర్శి జి.ప్రతిభా దేవి జీవో నెంబర్ 516 జారీ చేశారు. మూడేళ్ల పాటు ఈ పదవిలో ఆమె కొనసాగుతారు. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన సివిల్ కేసులను ఆమె ప్రభుత్వం తరపున వాదించాల్సి ఉంటుంది.

### రాజంపేట ఎంపీ,ఎమ్మెల్యేల రాజీనామాతోనే

## జిల్లా కేంద్రం సమస్యకు పరిష్కారం

**ఎన్నికల రెఫరెండంతోనే ప్రజల ఆకాంక్ష నెరవేరుతుంది**

**టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ జగన్మోహన్ రాజు**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జగన్మోహన్ రాజు

రాజంపేట, డిసెంబర్ 24 ప్రభాతవార్త

పార్టీ పదవులకు తాము రాజీనామా చేస్తే ఏమి కాదని, వైసిపి రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి రాజీనామా చేసినా ఏమీ కాదని, రాజంపేట జిల్లా కేంద్రం విషయంలో క్షమించరాని మోసం చేసిన ఎంపీ మిథున్ రెడ్డి,ఎమ్మెల్యే అమర్నాథరెడ్డి రాజీనామా చేయడం ద్వారానే జిల్లా కేంద్ర సమస్యకు పరిష్కారం ఏర్పడుతుందని టిడిపి రాజంపేట అసెంబ్లీ ఇన్చార్జ్ చమర్తి జగన్మోహన్రాజు అన్నారు. ఎంపీ ,ఎమ్మెల్యేలు రాజనామా చేస్తే ఎన్నికలు వస్తాయని, అజెండా మారుతుందని ప్రజల ఆకాంక్ష నెరవేరుతుందని స్పష్టం చేశారు. ప్రజలకు క్షమాపణ చెప్పి ఇద్దరూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలు వస్తేజిల్లా కేంద్రం రెఫరెండంతో ముందుకు వెళ్దాం అన్నారు. రాజంపేట జిల్లా కేంద్రం చేయాలని పార్టీ అధినాయకత్వానికి కూలంకషంగా వివరించామన్నారు. ప్రజలకు ఆమోద ఆమోదయోగ్యమైన నిర్ణయమే వస్తుందని భరోసా వ్యక్తం చేశారు.స్వార్థ రాజకీయాలతో రాజంపేట జిల్లా కేంద్రం కాకుండా గత వైసీపీ నాయకులు అడ్డుకున్నారని,ఇప్పుడు తిరిగి జిల్లా కేంద్రం కోసం పోరాడుతున్నట్లు నాటకాలు చేస్తున్నారని విమర్శించారు. వైకాపా నాయకులు ఎన్ని నాటకాలు చేసినా ప్రజలు నమ్మరని స్పష్టం చేశారు. అంతేకాకుండా రాజకీయ అంశాలను లోపల పెట్టుకుని,ప్రభుత్వాన్ని విమర్శిస్తూ రాజంపేటకు మద్దతు పలుకుతున్నట్లు నాటకాలు చేయడం సిగ్గుచేటు అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సి సుధాకర్,రాష్ట్ర కార్యదర్శి ఇడిమడకల కుమార్,ఏఎంసీ చైర్మన్ గన్నెసుబ్బ నరసయ్య నాయుడు,పట్టణ ప్రధాన కార్యదర్శి అడపాల శ్రీనివాసులు, సొసైటీ డైరెక్టర్ పరుశురాం నాయుడు,నల్లపనేని సురేంద్రబాబు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# వైకాపా మోసంతోనే రాజంపేట జిల్లా కేంద్రం పోయింది

**రాజంపేటలో కదం తొక్కిన ర్యాలీలో న్యాయవాదులు**

రాజంపేట, డిసెంబర్ 24 ప్రభాతవార్త



.రాజంపేట జిల్లా కేంద్రం కోసం ర్యాలీ చేస్తున్న న్యాయవాదులు



నిరాహార దీక్షలు సంఘీభావం తెలుపుతున్న జేఏసీ నేతలు

జిల్లాల పునర్ విభజన సమయంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చేసిన మోసంతోనే రాజంపేటకు జిల్లా కేంద్రం లేకుండా పోయిందని రాజంపేట బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కొండూరు శరత్ కుమార్ రాజు మండిపడ్డారు. వైకాపా పాలకుల పుణ్యమా అని నేడు రాజంపేటలో రోడ్డున పడాల్సిన పరిస్థితి వచ్చిందని ధ్వజమెత్తారు. రాష్ట్రమంతా ఒక పాలసీ అవలంబిస్తే రాజంపేటకు వచ్చేసరికి రాయచోటిని జిల్లా కేంద్రం చేసి మోసానికి పాల్పడ్డారని విరుచుకపడ్డారు. అర్హత లేని రాయచోటినీ జిల్లా కేంద్రం చేసి క్షమించరాని మోసం చేశారని మండిపడ్డారు. రాజంపేట జిల్లా కేంద్రం సాధన కోసం జరుగుతున్న ఉద్యమంలో భాగంగా 15వ రోజు బుధవారం రాజంపేటలో న్యాయవాదులు కదం తొక్కారు. రాజంపేట జిల్లా చేయాలని నిదానాలు చేశారు .రాజంపేట కోర్టు సముదాయం నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. రాయచోటి వద్దు, రాజంపేట ముద్దు అంటూ నినాదాలు చేశారు. ఈసందర్భంగా రాజంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి హనుమంత నాయుడు మాట్లాడుతూ భౌగోళికంగా అన్ని విధాల రాజంపేట జిల్లా కేంద్రం కు అర్హత ఉందని పేర్కొన్నారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం వైసిపి ప్రభుత్వం చేసిన తప్పులు సరిదిద్ది రాజంపేట జిల్లా కేంద్రం చేయాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు. మరోవైపు 15 రోజున టీడీపీ, జనసేన, కాంగ్రెస్ పార్టీల నేతలు చమర్తి జగన్మోహన్ రాజు, అతికారి కృష్ణ, పూలు భాస్కర్ నిరాహార దీక్షలో పాల్గొన్నారు. ఊటుకూరు,వెంకట్ రాజంపేట, భువననగిరి పల్లె గ్రామాల చెందిన నేతలు సతీష్ రాజు, కర్ణాటకం చంగల్ రాయుడు, ఎంఎల్ నారాయణ, మన్నేరు లక్ష్మీనారాయణ, కేఎస్ నరసింహ, గీతాంజలి వెంకటరమణ, కళాధర్, మార్కెట్ కమిటీ చైర్మన్ గన్నే సుబ్బనరసయ్య నాయుడు, టి. లక్ష్మీనారాయణ, సంజీవరావు, వెంకటేశ్వర్లు, తదితరులు నిరాహార దీక్షలో పాల్గొన్నారు.

## క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్

కడప క్రైం, డిసెంబరు 24, ప్రభాతవార్త:



జిల్లాలోని పోలీసు సిబ్బందికి మరియు వారి కుటుంబ సభ్యులకు మీడియా మిత్రులకు ప్రజలకు వైఎస్ఆర్ కడప జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఒక ప్రకటనలో క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్మస్ పండగ శాంతి, సంతోషం, త్యాగం, ప్రేమ మరియు కరుణకు ప్రతీకగా జరుపుకునే మహత్తర పండగ అన్నారు. ఏసుక్రీస్తు జన్మదినమైన క్రిస్మస్ పండగను ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా ఆహ్లాదకరమైన వాతావరణంలో జరుపుకోవాలని ఆకాంక్షించారు. సాటి మనుషుల పట్ల ప్రేమ, నిస్సహాయుల పట్ల కరుణ, ఆకాశమంతటి సహనం, అవధుల్లేని త్యాగం, శాంతియుత జీవనం వంటి విలువలు మానవాళికి క్రీస్తు అందించిన మహోన్నత సందేశాలని పేర్కొన్నారు. అందరూ ఐకమత్యంతో మెలుగుతూ ఎదుటివారిని క్షమించే గుణాన్ని అలవరుచుకోవాలని పిలుపునిచ్చారు.

## హంద్రీనీవా జలాలతో చెరువులు నింపండి

బి. కొత్తకోట డిసెంబర్ 24 ప్రభాతవార్త ;



తంబళ్లపల్లె నియోజకవర్గంలోని రైతాంగం నిత్యం కరువు బారిన పడుతున్నారని ప్రభుత్వం వెంటనే హంద్రీ నీవా సాగునీటి జలాలతో తంబళ్లపల్లె నియోజకవర్గంలోని చెరువులను నింపాలని రాజంపేట పార్లమెంట్ సభ్యుడు పెద్దిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిలతో కలసి బి .కొత్తకోట మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా సదస్సు నిర్వహించారు. సందర్భంగా ఉదయం నుండి మండలంలోని పలు గ్రామాల నుండి ప్రజలు తరలివచ్చారు. ఈ సందర్భంగా వారి సమస్యలను ఎంపీ మిథున్ రెడ్డి తో పాటు ఎమ్మెల్యే ద్వారక నాథరెడ్డిలు అడిగి తెలుసుకుని సంబంధిత అధికారులతో సమస్యల పరిష్కారానికి ఆదేశాలు జారీచేశారు. ప్రజల సమస్యల పరిష్కారం లో జాప్యం చేయరాదని అధికారులకు సూచించారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యేలు విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి రెండేళ్లు గడుస్తున్న హంద్రీ నీవా జలాల నిలువకు కార్యాచరణ చేయకపోవడం పై విమర్శించారు. తంబళ్లపల్లె నియోజకవర్గానికి రైతాంగానికి శాశ్వత సాగునీటి, తాగునీటి అవసరాల కోసం మా ప్రభుత్వంలో నిర్మిస్తున్న ముదివేడు ప్రాజెక్టును అధికార పార్టీ నాయకులే కేసులతో అడ్డుకున్నారని ఇప్పుడు మీ ప్రభుత్వమే అధికారంలో ఉందని ఇప్పటికైనా ముదివేడు ప్రాజెక్టు పూర్తిచేసి హంద్రీ నీవా జలాల నిలువ చేస్తే తంబళ్లపల్లెకు సాగు, తాగునీటి సమస్య తీరి స్థానిక రైతులు కరువు నుండి విముక్తి పొందుతారని తెలిపారు.

## నింగినుంచే డ్రోన్ కెమెరాలతో నిఘా

కడప క్రైం, డిసెంబరు 24, ప్రభాతవార్త:

కడప నగరంలో గంజాయి, నిషేధిత మత్తు పదార్థాల సేవనం, అసాంఘిక కార్యకలాపాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం సేవించే వారిపై కఠిన చర్యలకు పోలీసు అధికారులు స్పెషల్ పార్టీ సిబ్బంది ద్వారా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ మరియు డ్రోన్ కెమెరాల ద్వారా సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తున్నారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో వన్‌టౌన్ సీఐ చిన్న పెద్దయ్య ఆధ్వర్యంలో కడప నగరం వన్‌టౌన్ పీఎస్ పరిధిలో గంజాయి సేవనం, బహిరంగ మద్యపానం, అసాంఘిక కార్యకలాపాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాల్లో కడప సబ్ డివిజన్ స్పెషల్ పార్టీ సిబ్బంది దాడులు నిర్వహించారు. అత్యాధునిక డ్రోన్ కెమెరాల సాయంతో జల్లెడ పడుతున్నారు. బుధవారం అనుమానాస్పదంగా సంచరించే వారిపై నిఘా ఉంచడంతో పాటు గంజాయిని సేవించే వారిని బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిని గుర్తించేందుకు విస్తృత చర్యలు చేపట్టారు. నగరంలోని బుగ్గవంక పరివాహక ప్రాంతం, గుర్రాలగడ్డ, పాత బస్టాండ్, నాగరాజుపేట, రవి, రాజా థియేటర్ పరిసరాల్లో పాత భవనాలు, ఇళ్లు ఉన్న ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచడం ద్వారా అనుమానితులను గుర్తించే చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో నిరంతరం కడప నగరంలోని అనుమానిత ప్రాంతాలను పోలీసు శాఖ ఆధ్వర్యంలో జల్లెడ పట్టడం జరుగుతుందని పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఈ తరహా స్పెషల్ డ్రైవ్‌లు నిరంతరం కొనసాగుతాయని కడప డీఎస్పీ తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఎట్టి పరిస్థితుల్లోనూ కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## మాజీ సీఎంకు తీవ్ర అస్వస్థత

**డాక్టర్ల సలహా మేరకు అన్ని కార్యక్రమాలు రద్దు**

పులివెందుల డిసెంబర్ 24 ప్రభాత వార్త :

మాజీ సిఎం జగన్ బుధవారం అస్వస్థతకు గురి కావడంతో డాక్టర్ల సలహాలు మేరకు కార్యక్రమాలనన్నింటిని రద్దు చేసుకున్నారు. పులి వెందుల మూడు రోజుల పర్యటనలో భాగంగా రెండవ రోజు బుధవారం తీవ్ర చలి, జ్వరం రావడంతో అన్ని కార్యక్రమాలను రద్దు చేసుకుని తన నివాసంలో విశ్రాంతి తీసుకున్నారు. గురువారం క్రిస్మస్ సందర్భంగా పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో జరిగే క్రిస్మస్ వేడుకల్లో కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు.






# టమోటా రైతులకు గిట్టుబాటు ధరే లక్ష్యం

**మార్కెట్‌యార్డుశాఖ కమీషనర్ విజయసునిత**

మదనపల్లె, డిసెంబర్ 24 ప్రభాతవార్త :

వ్యవసాయ మార్కెట్‌యార్డులకు రైతులు తెచ్చిన టమోటాలకు గిట్టుబాటు ధర కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మార్కెట్‌యార్డు శాఖ డైరెక్టర్, కమీషనర్ విజయసునిత తెలిపారు. బుధవారం మదనపల్లె టమోటా మార్కెట్‌యార్డును కమీషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మార్కెట్‌యార్డులో రైతులకు కల్పించిన సౌకర్యాలు, యార్డుకు రైతులు తెస్తున్న టమోటాలను పరిశీలించి వ్యాపారులు, పాలకవర్గం ఛైర్మెన్ జంగాల శివరామ్, కమిటీ సభ్యులతో మాట్లాడారు. అనంతరం కమీషనర్ విలేకర్లతో మాట్లాడుతూ మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిసర ప్రాంతాల్లో సాగు చేసిన టమోటాలను రైతులు పక్క ప్రాంతాల్లోని మార్కెట్లకు తీసుకెలుతున్నారని రైతులు తెలపడం జరిగిందన్నారు. మదనపల్లె మార్కెట్‌లోనే రైతులకు సౌకర్యంగా చిన్నక్రేట్‌లతో వేలంపాటలు నిర్వహించి వారికి గిట్టుబాటు అయ్యే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అంగళ్ళు, మొలకలచెరువు, గుర్రంకొండ మార్కెట్‌యార్డుల వలే యూనిఫామ్‌గా ధరలు ఉండేలా అధికారులను ఆదేశించడం జరుగుతుందన్నారు. మదనపల్లె మార్కెట్‌కు పూర్వ వైభవం వచ్చేలా యార్డులో అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఇప్పటికే ఛైర్మెన్ చొరవతో మార్కెట్‌లో జాక్‌పాట్ విధానాన్ని రద్దు చేయడం జరిగిందన్నారు. వ్యాపారస్తులు కూడా సహకరించి రైతులకు అన్ని విధాల సహాయ సహకారాలు అందించాలన్నారు. మార్కెట్‌యార్డు అభివృద్ధికి త్వరలోనే షాపింగ్‌కాంప్లెక్స్ నిర్మాణాలు కూడా చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఛైర్మెన్ జంగాల శివరామ్, వైస్ ఛైర్మెన్ రామిశెట్టి ఆంజినేయులు, సెక్రటరీ జగదీష్, కమిటీ సభ్యులు బర్నేపల్లి రవికుమార్ సంధ్యారాణి, నరసింహులు, సుబ్రమణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



యార్డులో రైతులతో మాట్లాడుతున్న కమీషనర్

## సీఐను కలసిన అటవీ శాఖ కార్పొరేషన్ డైరెక్టర్

లక్కిరెడ్డిపల్లి: డిసెంబర్ 24 ప్రభాతవార్త



లక్కిరెడ్డిపల్లె నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన కృష్ణంరాజు నాయక్ ను రాష్ట్ర అటవీ శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ యర్రగొల్ల రెడ్డయ్య యాదవ్ పోలీస్ స్టేషన్ నందు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పూల బొకే అందజేసి టిడిపి నాయకులతో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి మైనార్టీ సెల్ జనరల్ సెక్రటరీ ఆరిఫ్, హాస్పిటల్ కమిటీ సభ్యులు భాస్కర్ రెడ్డి, జేకే టైలర్, ఫీల్డ్ అసిస్టెంట్ నస్రుద్దీన్, అశోక్, వైస్ వెంకటరమణ, వేదుక శ్రీను, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీల విభజనపై గ్రామసభలు

దువ్వూరు, డిసెంబర్ 24, ప్రభాతవార్త:

మండల పరిధిలోని కొన్ని గ్రామ పంచాయతీలను విభజించి కొత్తగా ఏర్పాటు చేయడం మరికొన్ని పంచాయతీ లోని గ్రామాలను వేరొక పంచాయతీలో విలీనం చేయడం వంటి వాటిపై బుధవారం గ్రామసభ నిర్వహించారు. మండల పరిధిలోని చిన్న సింగనపల్లి గ్రామంలో ఉన్న ఎల్లాల్ కొట్టాల్ గ్రామాన్ని రామాపురం పంచాయతీలో చేర్చాలని పలువురు కోరడంతో దాని మేరకు చిన్న సింగనపల్లె గ్రామ పంచాయతీ గ్రామ సభను నిర్వహించారు. అలాగే భీముని పాడులో సంగటి తిమ్మాయ పల్లె గ్రామాన్ని విలీనం చేయాలని కోరడంతో దానిపై కూడా గ్రామసభ నిర్వహించారు. మొత్తం పైన ప్రభుత్వం గ్రామ పంచాయతీలను విభజించడం, విలీనం చేయడం పై జీఓలు జారీ చేయడంతో మండలంలోని చిన్న సింగన పల్లె, చల్లబసాయపల్లె, చింతకుంట గ్రామపంచాయతీలపై ఈ జీఓ ప్రభావం ఉన్నట్టు తెలుస్తోంది. గ్రామసభలు ఆమోదించడం తర్వాత వాటిని జిల్లా పంచాయతీ రాజ్ అధికారులకు పంపుతున్నట్టు తెలిపారు. గ్రామసభలు పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో నిర్వహించారు.

## టిడిపి జిల్లా ఉపాధ్యక్షులుగా మల్లిఖార్జున రెడ్డి

బ్రహ్మంగారిమఠం డిసెంబర్ 24 ప్రభాతవార్త



మైదుకూరు నియోజకవర్గం శాసన సభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ ఆశీస్సులతో కడప జిల్లా తెలుగు దేశం పార్టీ ఉపాధ్యక్షులుగా మైదుకూరు నియోజకవర్గం, బ్రహ్మంగారిమఠం మండలం, రేకలకుంట పంచాయతీ, అగ్రహారం గ్రామానికి చెందిన కానాల మల్లిఖార్జునరెడ్డిని నియమిస్తూ అధిష్టానం ప్రకటించింది. ఈ సందర్భంగా కానాల మల్లిఖార్జున రెడ్డి మాట్లాడుతూ కడప జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులుగా నియమించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ టీడీపీ జిల్లా అధ్యక్షుడు భూపేష్ రెడ్డి టీడీపీ మండల అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి కి ధన్యవాదాలు తెలిపారు.

## రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధిగా పురుషోత్తం రెడ్డి

పీలేరు డిసెంబర్ 24 ప్రభాతవార్త:



రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధిగా ఎంవి పురుషోత్తం రెడ్డి అలియాస్ కోటపల్లి బాబు రెడ్డి నియమితులయ్యారు. బుధవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుంచి ఈ మేరకు ఆయనకు సమాచారం అందింది. తనను వరుసగా మూడో సారి ఈ పదవికి ఎంపిక చేసినందుకు శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి కి ధన్యవాదాలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజంపేట పార్లమెంటు పరిధిలో తెలుగుదేశం పార్టీని బలోపేతం చేస్తూ ముందుకు నడిపిస్తానని అన్నారు. ఈ సందర్భంగా ఆయనను మాజీ మండల ఉపాధ్యక్షులు పోలిశెట్టి సురేంద్ర, ప్రముఖ మైనార్టీ నాయకులు లడ్డు జాఫర్, రెడ్డిమున్ని, శివ ప్రసాద్ అభినందన తెలియజేశారు.

## ప్రయాణ ఖర్చు తగ్గేలా పూర్తి చేయాలి



రాయచోటి టౌన్ డిసెంబర్ 24, ప్రభాతవార్త

రహదారుల పనులు వేగవంతంగా మరియు ప్రజలకు ప్రయాణ ఖర్చు తగ్గేలా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం రాయచోటి కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో పంచాయతీరాజ్, రహదారులు మరియు భవనాల శాఖ, గ్రామీణ నీటి సరఫరా శాఖ, నీటిపారుదల శాఖ, జాతీయ రహదారులు, డ్వామా తదితర ఇంజనీరింగ్ శాఖల పనుల పురోగతిపై జిల్లా మరియు డివిజనల్ స్థాయి అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన, నాబార్డ్, తదితర నిధులతో చేపడుతున్న రహదారుల పనులను వేగవంతం చేయాలని గ్రామీణ రహదారులను మండల రహదారులకు మండల రహదారులను డివిజన్ స్థాయి రహదారులకు డివిజన్ స్థాయి రహదారులను జిల్లా స్థాయి రహదారులకు కలిపే విధంగా పనులు చేపట్టాలని సూచించారు. రహదారుల పనులు పూర్తి చేసేటప్పుడు ప్రజలకు ప్రయాణ ఖర్చు తగ్గేలా చూసుకోవాలని సూచించారు. పల్లె పండుగ । మరియు ॥ కార్యక్రమాలలో జరిగే పనులను వేగవంతం చేయాలన్నారు. గ్రామీణ నీటి సరఫరా శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న జలజీవన్ మిషన్ వాటర్ గ్రిడ్ తదితర ప్రాజెక్టులను కాలపరిమితితో పూర్తి చేయాలన్నారు జలజీవన్ మిషన్ కార్యక్రమంలో 3079 పనులలో 2615 పనులు పూర్తి చేశారని మిగిలిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. జాతీయ రహదారుల పనులపై సమీక్షిస్తూ రాయచోటి నుండి వేంపల్లి వరకు ఎన్ హెచ్ 440 రహదారిపై పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. ఎన్ హెచ్ 40 మరియు ఎన్హెచ్ 440 రహదారులపై రాయచోటి బైపాస్ రహదారి పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. రాజంపేట మదనపల్లి మరియు రాయచోటి డివిజన్లో డ్వామా శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న చిన్న తరహా నీటి పారుదల పనులను వెంటనే పూర్తి చేయాలని సంబంధిత శాఖ అధికారులను మరియు సిబ్బందిని ఆదేశించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆయా శాఖల డివిజన్ స్థాయి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మురళి మేస్త్రి కుటుంబానికి ఆర్థిక సహాయం

వేంపల్లి డిసెంబర్ 24:(ప్రభాత వార్త):

గత నాలుగు రోజులు క్రితం వేంపల్లిలోని వడ్డెర వీధికి చెందిన సాతర్ల మురళి మేస్త్రి రెండు కిడ్నీలు పాడై మృతి చెందడం జరిగింది ఆయన కుటుంబ సభ్యులకు రిటైర్డ్ ఎల్ ఎఫ్ ఎల్ హెచ్ ఎం సింగారెడ్డి నరసింహారెడ్డితమ వంతుగా సహాయంగా పదివేల రూపాయలు ఆర్థిక సహకారం అందించారు..ఈ కార్యక్రమం లో రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు..

## ప్రశంసా పత్రాలు..

కడప కార్పొరేషన్ డిసెంబర్ 24 ప్రభాతవార్త:

పల్స్ పోలియో విజయవంతంగా పూర్తి చేసినందుకు కడప 47వ డివిజన్ అక్కయ్యపల్లి లో రిమ్స్ విద్యార్థులు, గీతాంజలి నర్సింగ్ కాలేజ్ విద్యార్థులు, అయ్యవార్ రెడ్డి నర్సింగ్ కాలేజ్ విద్యార్థులు, ఏఎన్ఎంలకు, సూపర్వైజర్లకు, కార్పొరేషన్ సిబ్బందికి ప్రశంసా పత్రాలను కడప నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్ర, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రమేష్ లు అందించారు.



## స్నేహిత అమృత హస్తం భవనానికి విరాళాలు

వేంపల్లె, డిసెంబర్ 24, ప్రభాతవార్త

స్నేహిత అమృత హస్తం సేవా సమితి నూతన భవన నిర్మాణానికి దాతలు విరాళాలు అందజేసినట్లు ఆ సమితి అధ్యక్షుడు రాజు వెల్లడించారు. బుధవారం స్థానిక స్వామి వివేకానంద కరస్పాండెంట్ రామాంజనేయరెడ్డి రూ.25 వేలు, శ్రీచైతన్య కరస్పాండెంట్ బండ్రెడ్డి చక్రపాణిరెడ్డి రూ.10 వేలు, ప్రముఖ వైద్యుడు డా.ఎస్ఎఫ్ బాషా రూ. 5 వేలు, వీణా క్లాత్ యజమాని రూ.5 వేలు, విశ్రాంత ఉపాధ్యాయుడు రూ. 5 వేలు విరాళం అందజేశారు. ఈ నగదు మొత్తాన్ని ఆ సేవా సమితి అధ్యక్షునికీ అందించారు. భవన నిర్మాణానికి దాతల విరాళం ఎనలేనిదని, వీరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## బంగ్లాదేశ్ హిందువులపై దాడులు దురదృష్టకరం

వేంపల్లె: డిసెంబర్: 24 (ప్రభాతవార్త



బంగ్లాదేశ్ దేశంలో హిందువులపై దాడులు జరగడం దుర దృష్టకరమని కాంగ్రెస్ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డా.ఎన్. తులసిరెడ్డి ఆవేదన వెలిబుచ్చారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 18న చంద్రదాస్ దీపుని కొట్టి సజీవ దహనం చేయడం అత్యంత అమానుషం అన్నారు. హిందువుల ఛాంపియన్ అని చెప్పుకుంటున్న మోదీ ప్రభుత్వం మౌనంగా, నిస్సహాయతతో ఉండడం శోచనీయమని, సామ దాన భేద దండోపాయాలు ప్రయోగించి, అంతర్జాతీయ సమాజం నుండి ఒత్తిడి తెప్పించాలన్నారు. బంగ్లాదేశ్ లో హిందువులపై దాడులను అరికట్టాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని టిడిపి కూటమి విరమించుకోవాలని డిమాండ్ చేశారు. జీఓ 590 ని ఉప సంహరించుకోవాలన్నారు. అంతేకాకుండా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు అవుతున్నా ఇప్పటికీ అర్హులకు కొత్త పెన్షన్ రాలేదని, అర్హులందరికీ సంఖ్యతో సంబంధం లేకుండా పెన్షన్ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రసాద్ గౌడ్, సుబ్బారెడ్డి, ఉత్తన్న, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఆర్ఐటీ విద్యార్థుల ప్రతిభ

ప్రొద్దుటూరు క్రైం, డిసెంబరు 24, ప్రభాతవార్త:



ఈ నెల 22, 23 తేదీల్లో కడప మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన అంతర్ జిల్లా స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్లో సాయి రాజేశ్వరి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాల 2వ ఏడాది డిప్లొమా సీఎంఈ విద్యార్థిని ఎన్.శశికళ లాంగ్‌జంప్‌లో ప్రథమ స్థానం, ట్రిపుల్ జంప్‌లో ద్వితీయ స్థానం, వంద మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం అలాగే 3వ ఏడాది డిప్లొమో ఈఈఈ విద్యార్థిని టి.గంగా ధరణి షాట్‌పుట్‌లో తృతీయస్థానంలో నిలిచినందుకు మెడల్స్ మరియు సర్టిఫికెట్లు దక్కించుకోవడం జరిగిందని ప్రిన్సిపల్ డా.పాండురంగన్‌రవి తెలిపారు. ఈ సందర్భంగా క్రీడలలో ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థినిలను ఛైర్మన్ బసిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీర కుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీర కల్యాణ్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డా.ఎ.వెంకటేశ్వరరెడ్డి, హెచ్ఓడీలు, పీడీలు మహ్మద్, భార్గవరాముడులు అభినందించారు.

## నందిమండలంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం

పెండ్లిమర్రి, డిసెంబరు 24, ప్రభాతవార్త:



మండల పరిధిలోని నందిమండలం గ్రామంలో వ్యవసాయ మరియు అనుబంధ శాఖల ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మాట్లాడుతూ ప్రస్తుత రబీ సీజన్‌లో వేసిన ప్రతి పంటని ఈ క్రాప్ బుకింగ్ యాప్ నందునమోదు చేయించుకోవాలని తద్వారా ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని పథకాలు నేరుగా రైతులకు లబ్ధి చేకూరుతాయని, అంతేకాక ఈ సీజన్‌లో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు, ఎరువుల లభ్యత క్రాప్ ఇన్సూరెన్స్, ప్రకృతి వ్యవసాయం, ఉద్యానశాఖ పథకాలు తదితర అంశాల గురించి తెలిపారు. తదుపరి వెటర్నరీ శాఖ వారు మాట్లాడుతూ గ్రామంలో ఉన్న మూగజీవాలకు ఎప్పటికప్పుడు వ్యాక్సిన్ వేయించుకొని వ్యాధుల నుంచి నివారణ చర్యలు చేపట్టాలని, ప్రభుత్వ అంబులెన్స్ కూడా అందుబాటులో ఉంది. దానిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు ఏఈఓ గంగాధర్‌రెడ్డి, వీఏఏ తేజ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## రెండు ఇళ్లల్లో చోరీకి యత్నం

### కొరబడిన పోలీసు నిఘా

మదనపల్లి డిసెంబర్ 24 ప్రభాతవార్త



పట్టణ సమీపం లోని అనప గుట్ట వద్ద ఉన్న శ్రీవారి నగరలో బుధవారం తెల్లవారుజామున రెండు ఇళ్లల్లో చోరీకి యత్నం జరిగింది. బాధితుల కథనం మేరకు వివరాలు ఈలా ఉన్నాయి. శ్రీవారి నగర్ ముఖ ద్వారం వద్ద ఉన్న మేశ్రీ రమణ వారి కుటుంబ సభ్యులు నిద్రిస్తుండగా బుధవారం తెల్లవారుజామున రెండు గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు వారింట్లో చోరీకి యత్నించారు. ఇంట్లో నిద్రిస్తున్న మహిళ మేల్కొనడంతో దొంగలు అక్కడి నుంచి పరారయ్యారు. దొంగలు వెంట తెచ్చుకున్న ఇనుప గుణపంతో తలుపు బద్దలు చేసేందుకు యత్నించారు. శబ్దం రావడంతో నిద్రిస్తున్న కుటుంబ సభ్యులు మేల్కొని అరవడంతో వారు అటు నుంచి పరారయ్యారు. శ్రీవారి నగర్ లో ఇంత వరకు ఇళ్లల్లో ఇలాంటి చోరీయత్నాలు జరిగిన దాఖలాలు లేవు. గతంలో రెండవ పట్టణ పోలీసులు రాత్రుల్లో ఈ ప్రాంతంలో గస్తీ తిరిగేవారు. గత ఆరు నెలలుగా పోలీసులు ఈ ప్రాంతంలో గస్తీలు తిరిగిన దాఖలలులేవు. రాత్రుల్లో బయట ప్రాంతాల వ్యక్తులు ఎక్కువగా సంచరిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. పట్టణానికి శ్రీవారి నగర్ ప్రాంతము శివారుగా ఉండడం, ఈ ప్రాంతంలో ప్రముఖంగా రెండు ఆలయాలు ఉండడం కూడా విశేషం. పోలీసులు ఇకనైనా ఈ ప్రాంతంలో రాత్రులందు గస్తీ నిర్వహించి చోరీలు నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. పేదలు నివసించే ఈ ప్రాంతంలో పోలీసులు ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేయాల్సి ఉంది.

## కమిషనర్ ప్రవర్తనపై చైర్‌పర్సన్ ఆవేదన

ప్రొద్దుటూరు డిసెంబర్ 24 ప్రభాతవార్త



ప్రొద్దుటూరు పురపాలక సంఘం కమిషనర్ చిత్తా రవిచంద్ర రెడ్డి వ్యవహరిస్తున్న తీరుపై చైర్పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆమె ఛాంబర్ లో విలేకరులతో మాట్లాడుతూ మంగళవారం రాత్రి తనకు కమిషనర్ రవిచంద్రారెడ్డి డిసెంబర్ నెల కౌన్సిల్ సమావేశానికి సంబంధించిన రఫ్ అజెండా తయారైందని సమాచారం తెలపగా, తాను బుధవారం కార్యాలయంలో చర్చిద్దామని తెలిపానని, ఉదయం, సాయంత్రం కార్యాలయ సమయంలో తాను ఛాంబర్ లో వేచి వున్నా కమిషనర్ రఫ్ అజెండాతో తన ఛాంబర్‌కు రాలేదని వివరించారు. ప్రజా సమస్యల కు సంబంధించిన అజెండాపై చర్చించేందుకు కమిషనర్ రాకపోవడంపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. అదేవిధంగా గత నెలలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో తాము అజెండా లోని అన్ని అంశాలు ఆమోదం తెలిపితే అవి చెల్లవని కమిషనర్ పేర్కొన్నారని తెలిసిందని, వైసిపికి కోరమ్ వుందని కమిషనర్ రవిచంద్రారెడ్డి గుర్తించాలని స్పష్టం చేశారు. కమిషనర్ రవిచంద్రారెడ్డి టిడిపి వారికి అనుకూలంగా వ్యవహరించడం మానుకోవాలని సూచించారు. కేవలం తాను బిసి మహిళా చైర్ పర్సన్ అనే కారణంతోనే కమిషనర్ తనను అగౌరవ పరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ సాయంత్రం ఐదున్నర గంటలైనా సమావేశానికి సంబంధించిన రఫ్ అజెండా తీసుకొని చర్చించేందుకు రాకపోవడం బాధాకరమన్నారు.

## బీటెక్ రవికి రిటర్న్ షాక్ ఇచ్చిన జగన్

పులివెందుల , డిసెంబర్ 24 , ప్రభాత వార్త :



పులివెందుల నియోజక వర్గంలో వరసగా జగన్ కు షాక్ ఇస్తూ వచ్చిన బీటెక్ రవికి బుధవారం పులివెందుల పట్టణంలో జగన్ నుంచి రిటర్న్ షాక్ తగిలింది. పులివెందుల పట్టణంలోని బేతేలు చర్చి సమీపంలో ఉన్న టిడిపి నాయకులు బుధవారం కౌన్సిలర్ శ్యామల దేవి, కౌన్సిలర్ కోడి రమణ, చిన్నల ఆధ్వర్యంలో 20 కుటుంబాలు టిడిపి పార్టీని వీడి వైకాపా తీర్థం పుచ్చుకున్నారు. హాజీరా, ఆయేషా, అనిప, ఇబ్రహీం, యూసుఫ్, మహమ్మద్, రఫీ, బావ పక్రుద్దీన్, కాజా, హమీద, మాబ్జాన్, కైరున్, మాబ్జాన్, ఆదం, ఇమ్రాన్ భాష, నూర్ మహ్మద్, మున్ని, కౌసర్, బాబావల్లి, మున్ని, చాంద్ భాషాలకు మున్సిపల్ వైకాపా ఇన్చార్జ్ వైయస్ మనోహర్ రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అన్ని పథకాలు ఇంటి వద్దకు వచ్చి అందించే వారిని, ఈ ప్రభుత్వంలో ఒక పథకం కూడా అందలేదన్నారు. గత ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి సంక్షేమానికి పెద్ద పీటవేశారన్నారు. జగన్మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేసుకుంటే సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందుతాయి అన్నారు. కూటమి ప్రభుత్వం లో రౌడీయిజం రాజ్యమేలు తుందన్నారు. ఈ ప్రభుత్వాన్ని గద్ద దించేందుకు రాష్ట్ర ప్రజలు వేచి ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, పట్టణ అధ్యక్షుడు హాల్ గంగాధర్ రెడ్డి, మాజీ చైర్మన్లు చిన్నప్ప, రసూల్పట్టణ ఉపాధ్యక్షుడు కౌన్సిలర్ పార్నపల్లి కిషోర్,, వైకాపా నాయకులు వీరారెడ్డి, చలపతి, నరసారెడ్డి , కనక, తదితరులు పాల్గొన్నారు.

## క్రిస్మస్‌కు ముస్తాబైన చర్చి

నందలూరు, డిసెంబర్ 24 ప్రభాతవార్త :

మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఆర్ఎస్ రోడ్డులో ఉన్న ఆర్సీఎం చర్చి క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైంది. చర్చిని విద్యుత్ కాంతులతో ఆకర్షణీయంగా అలంకరించారు. బుధవారం రాత్రి 11 గంటల నుంచి చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభం కానున్నాయి. బాల యేసును సుందరంగా అలంకరించిన పశువుల పాకలో ఉంచి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు.

## ఆర్వో ప్లాంట్లను పునరుద్దరిస్తాం

పీలేరు, డిసెంబర్ 24 ప్రభాతవార్త:

గ్రామ పంచాయతీ పరిధిలో మరమ్మతులకు గురైన ఆర్వో ప్లాంట్లను తిరిగి పునరుద్ధరిస్తామని ఈవో బ్రహ్మానందరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో వాటర్ మెన్ లు పారిపద్య కార్మికులతో మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పరిధిలో 24 ప్లాంట్లు ఉన్నాయని ఇందులో 18 పని చేస్తున్నాయని. మిగిలినవి త్వరలో పునరుద్దరిస్తామని తెలిపారు. అయితే వాటర్ మెన్లకు జీతాలు చెల్లించాల్సి ఉందని, డీపీఓ ఆదేశాల మేరకు త్వరలో వారికి జీతాలు చెల్లిస్తామన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ సిబ్బందిచే ఆర్వో ప్లాట్లు ద్వారా తాగునీరు అందిస్తామని తెలిపారు.

## సీఐపై చర్యలు తీసుకోవాలి

పీలేరు డిసెంబర్ 24 ప్రభాతవార్త:



ఓ కేసు విషయంగా పోలీసు సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయానికి వెళ్లిన సీనియర్ న్యాయవాది పి.షౌకత్ అలీ ను కించపరుస్తూ మాట్లాడిన పీలేరు సీఐ యుగంధర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పీలేరు న్యాయవాదుల సంఘం డిమాండ్ చేసింది. బుధవారం న్యాయవాదుల సంఘ కార్యాలయంలో బార్ అధ్యక్షులు బిసి పురుషోత్తం రెడ్డి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం జరిగింది, ఈ సందర్భంగా బార్ అధ్యక్షులు బిసి పురుషోత్తం రెడ్డి, కార్యదర్శి సంద్రశేఖర్, న్యాయవాదులు మధుసూదనరెడ్డి, తెనాలి రామసంబ్రమణ్యం, ఇతర న్యాయవాదులు మాట్లాడుతూ ఈనెల 21న ఒక ముద్దాయి విషయంలో సిఐ కార్యాలయానికి వెళ్లిన అతని ఇటుంబ సభ్యుడు ఖాదర్ బాషాను స్టేషనుకు తీసుకువచ్చి బెల్టుతో విచక్షణా రహితంగా కొట్టి రాత్రి ఇంటి వద్ద వదిలి వెళ్లారన్నారు. తిరిగి మరుసటి దినం పోలీసులు ఖాదర్ బాషాకు ఫోన్ చేసి, మళ్లీ స్టేషనుకు రమ్మని పిలిచారని, దానికి ముందు రోజు జరిగిన ఘటనతో భయపడిన అతను న్యాయవాది షౌకత్ అలీని ఆశ్రయించాడు. దీంతో ఆ న్యాయవాది ఖాదర్ బాషాను తన వెంట తీసుకుని సీఐ కార్యాలయానికి వెళ్లారని తెలిపారు. న్యాయవాది సీఐతో మాట్లాడుతూ ముద్దాయి సైపుల్లాను మీముందు హాజరు పరుస్తామని అతన్ని కొట్టవద్దని విన్నవించారని చెప్పారు. అప్పుడు సీఐ న్యాయవాదితో ఏకవచనంతో సంబోధిస్తూ వాణ్ణి ఏలా అరెస్టు చేయాలో తనకు తెలుసని, సిఫారసు ఏమి అవసరం లేదంటూ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారన్నారు. అలాగే లోకాయుక్తకు ఫిర్యాదు చేస్తామని న్యాయవాదులు స్పష్టం చేశారు. న్యాయవాదుల ఆరోపణపై పీలేరు సీఐ యుగందర్‌ను వివరణ కోరగా తాను న్యాయవ్యవస్థను కించపరచలేదని, ఒక కేసు విషయంలో ముద్దాయిని విచారిస్తుండగా న్యాయవాది షౌకత్ వచ్చి విచారణలో తలదూర్చాడని తాను విచారణలో ఉండగా మీరు నచ్చి మాట్లాడడం సబబు కాదని సున్నితంగా న్యాయవాదితో అన్నాని చెప్పారు. ఒక బాధ్యత కలిగిన పోలీసు అధికారిగా న్యాయవ్యవస్థను గౌరవిస్తామని చట్టపరదిలోనే తాను కేసులు విచారిస్తున్నాని. సివిల్ వ్యవహారాల్లో సెటిల్మెంట్లు వేయడం లేదని చెప్పారు. న్యాయవాది షౌకత్ చిన్న విషయాన్ని కొండంత చేసి ఆరోపణలు చేస్తున్నారని, అతని ఆరోపణలు వాస్తవం కాదని అన్నారు.

## ప్రొద్దుటూరు నుంచి ఆరుగురికి చోటు



ప్రొద్దుటూరు అర్బన్, డిసెంబర్ 24 ప్రభాతవార్త

టీడీపీ కడప పార్లమెంట్ కమిటీలో ప్రొద్దుటూరు నుంచి 6 గురికి చోటు కల్పించారు. పార్లమెంట్ ప్రధాన కార్యదర్శిగా వై.ఎస్ జబీబుల్లా,పార్లమెంట్ వైస్ ప్రెసిడెంట్గా గాజుల శివజ్యోతి,పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా పూదూరు శ్రీనివాసులురెడ్డి, పార్లమెంట్ అఫీషియల్ స్పోకెన్ పర్సన్గా ఘంటసాలవెంకటేశ్వర్లు, మిట్ట బాల చరణ్ కుమార్, పార్లమెంట్ సెక్రటరీగా తలారి పుల్లయ్యను అధిష్టానం నియమించింది. ప్రొద్దుటూరు నియోజకవర్గం సంబంధించి ఆరు మందికి కడప పార్లమెంటు కమిటీలో తెలుగుదేశం పార్టీ అవకాశం కల్పించడం పట్ల ప్రొద్దుటూరు టిడిపి నాయకులు కార్యకర్తలు తమ హర్షం వ్యక్తం చేశారు.

## భోజనశాలను పరిశీలించిన అధికారులు

దువ్వూరు, డిసెంబర్ 24, ప్రభాతవార్త:

దువ్వూరు లోని జిల్లా పరిషత్ హైస్కూల్ నందు నూతనంగా నిర్మిస్తున్న భోజనశాలను పంచాయతీరాజ్ కు చెందిన ఇంజనీరింగ్ అధికారులు బుధవారం పరిశీలించారు. 40 లక్షలతో నిర్మిస్తున్న ఈ భోజనశాల నిర్మాణం ఎంత మేరకు వచ్చింది, ఎన్ని రోజుల్లో పూర్తి అవుతుందనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎస్ఈ మాదన్న, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ మల్లికార్జునప్పలు పాల్గొన్నారు. అనంతరం వారు అక్కడ మాట్లాడుతూ వీటిని త్వరగా నిర్మించి పూర్తి చేయాలని అన్నారు. భోజనశాల పూర్తయిన వెంటనే మండలంలోని అన్ని పాఠశాలలకు ఇక్కడి నుంచే భోజనం సరఫరా అవుతుందన్నారు. జిల్లా కలెక్టర్ భోజనశాల నిర్మాణాలు పూర్తిచేయాలని ఆదేశించడంతో వాటిని పరిశీలించేందుకు వచ్చారు. ఈ కార్యక్రమంలో పిడి ఆదిశేషారెడ్డి, ప్రత్యేక అధికారి విజయ్ కుమార్, ఎండిఓ సుబ్బారెడ్డి, ఈఈ మల్లికార్జున, డిఈ మధుసూదన్ బాబు, ఏఈలు సుబ్రహ్మణ్యం, శివకుమార్, ఏపీఓ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు,



## రాజంపేట జిల్లా కేంద్రం కోసం జర్నలిస్టుల దీక్ష



రైల్వేకోడూరు డిసెంబర్ 24(ప్రభాతవార్త)::::

రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలంటూ బుధవారం రైల్వేకోడూరు నియోజకవర్గంలోని జర్నలిస్టులు తమ వంతు వ్యక్తిగత బాధ్యతగా ఒకరోజు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. గత 11 రోజులుగా ఈ జెఏసి జేఏసీ ఆధ్వర్యంలో రాజంపేట జిల్లా సాధన కోసం రిలే నిరాహార దీక్షలు, ర్యాలీలు, నిరసనలు నిర్వహిస్తున్నారు అందులో భాగంగా వారికి సంఘీభావంగా జర్నలిస్టులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ప్రైవేట్ విద్యాసంస్థల నిర్వాహకులు, విద్యార్థులు, విభిన్న ప్రతిభావంతులు, జేఏసీ నాయకులు,తదితరులు సంపూర్ణ మద్దతు తెలిపారు. త్రినేత్రం ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే జర్నలిస్టులు జిల్లా సాధన కోసం తాము సైతం అంటూ చేపట్టడం హర్షించదగ్గ విషయమని జేఏసీ నాయకులు అన్నారు. జర్నలిస్టులు రమేష్, వేణుగోపాల్ చౌదరి సునీల్, సుదర్శన శర్మ, పంద్ర ప్రసాద్,నాగేంద్ర, రవి, రెడ్డయ్య, వల్లి,ఎం ప్రసాద్, నరసింహ,పి వెంకటేష్, వి సుబ్రహ్మణ్యం, సుబ్బారావు తదితరులు దీక్ష చేపట్టారు.

## శాంతి భద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

లక్కిరెడ్డిపల్లి: డిసెంబర్ 24 ప్రభాతవార్త



మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని నూతన బాధితులు చేపట్టిన సిఐ కృష్ణంరాజు నాయక్ ను టిడిపి మండల అధ్యక్షులు యనమల మదన మోహన్ కోరారు. నూతన బాధితులు చేపట్టిన ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా చెత్త వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని శాంతి పద్ధతులు పరిరక్షించేలా చర్యలు చేపట్టాలని సిఐని కోరారు. ఈ కార్యక్రమంలో మదన్మోహన్ తో పాటు క్లస్టర్ కన్వీనర్ శంకారపు జయరాం, మద్దిరేవుల సింగిల్ విండో అధ్యక్షుడు బత్తిన దేవేంద్ర రెడ్డి, సర్పంచులు లక్ష్మీనారాయణ, కేశవయ్య, రంగసుబ్బయ్య,టిడిపి నాయకులు సిద్ధక వెంకట్రామిరెడ్డి, యాగంటి సుధీర్, కావలి ఆంజనేయులు, సోడి వెంకటేశ్వర్లు, టీచర్ రామచంద్ర, తెలుగు యువత ధర్మారెడ్డి, బాలే పెద్దరెడ్డి యాదవ్, రామాంజనేయులు, నాగమల్లె నాయుడు, బీదగాని రమణ, గంగయ్య, మురికినాటి రమణ, ఐటీడీపీ అధ్యక్షుడు రౌతు శివశంకర్, ఆదిమూలం గంగయ్య, వట్టికాళ్ళ రమణ, ఆనంద్, చింతకుంటపల్లి బాబు, రామచంద్ర, వివేకానంద రెడ్డి, కావలి రమణ, కొలిమి రవి శంకర్, ఎర్రగుడి రాజా, పీరయ్య, మక్బుద్, డీలర్ అన్వర్ భాష, సుబ్బయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ రమణ, కృష్ణయ్య, వేణు, తదితరులు ఉన్నారు.

## తల్లిదండ్రుల పోషణ, సంరక్షణ చేయకపోతే ఆస్తికి అనర్హులే

(సంతానాన్ని బయటకు వెళ్లగొట్టవచ్చు-అండగా పోషణ చట్టాలు-సుప్రీం కోర్టు తీర్పు)

బద్వేలు లీగల్, డిశంబరు 24 ప్రభాతవార్త :

సంతానాన్ని పెంచి, పెద్ద చేసిన తల్లిదండ్రులు వృద్ధాప్యములో నిరాదరణకు గురై ఎంతో క్షోభను అనుభవిస్తున్నారు. బ్రతుకు మార్గం చూపించిన తల్లిదండ్రులను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. చట్ట పరంగా వృద్ధులకు కూడా హక్కులు ఉన్నాయి. నిరాదరణకు గురవుతున్న సందర్భాలలో వారికి న్యాయ స్థానాలు అండగా నిలుస్తున్నాయి అంటూ వృద్ధాప్యములో వున్న తల్లిదండ్రుల స్థితిగతులను పట్టించుకోని లేక నిరాదరణ గావించిన సంతానమునకు తల్లిదండ్రుల ఆస్తులను అనుభవించే హక్కు ఉండదని సుప్రీం కోర్టు ధర్మాసనం సుస్పష్టం చేసింది. బిడ్డల నిరాదరణకు గురయ్యే వారికి 2007 సంవత్సరంలో తల్లిదండ్రుల, వృద్ధుల సంరక్షణ, పోషణ చట్టం అనగా మెయింటెనెన్స్ అండ్ వెల్ఫేర్ ఆఫ్ పేరెంట్స్ అండ్ సీనియర్ సిటిజన్స్ ఆక్టు-2007 అండగా నిలుస్తుందని ధర్మాసనం వెల్లడించింది. వివరాలలోకి వెళితే... మహారాష్ట్రకు చెందిన 80 ఏళ్ళ కమలాకాంత్ మిశ్రా, ఆయన భార్య చేసిన దాఖలు చేసిన పిటీషన్‌ను జస్టిస్ విక్రమ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం విచారిస్తూ 2023 లో పిటీషనర్ అయిన ముసలి జంట తమ కుమారుని నుంచి పోషణ, సంరక్షణ ఖర్చులతో పాటు తమ ఆస్తులను తమకే చెందేలా చూడాలని కోరుతూ మెయింటెనెన్స్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించగా తమకున్న రెండు ఆస్తులను స్వాధీనము చేసుకుని తమను నివాసం ఉండకుండా కుమారుడు అడ్డుకుంటున్నాడని పిటీషన్‌లో వారు ఆరోపించగా పరిశీలించిన ట్రిబ్యునల్ నెలకు రూ.3 వేలు ఇవ్వాలని, అలాగే వారు స్వాధీనం చేసుకున్న ఇంటిని ఖాళీ చేసి ఇవ్వాలని తీర్పును వెలువరించింది. అయితే బొంబై హైకోర్టు ఆ తీర్పును త్రోసిపుచ్చింది. తల్లిదండ్రుల, వృద్ధుల సంరక్షణ, పోషణ చట్టం-2007 ప్రకారం ఆ కుమారుడు కూడా సీనియర్ సిటిజన్ కావడంతో అతడిని ఇంటి నుండి వెళ్లగొట్టేలా ఆదేశాలు ఇచ్చే న్యాయ పరిధి లేదని పేర్కొంది. అయితే హైకోర్టు పరిగణనలోనికి తీసుకున్న కారణం తప్పని సుప్రీం కోర్టు ధర్మాసనం అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ ట్రిబ్యునల్ తీర్పును సమర్థించింది. తమ పెద్ద కుమారుడు తమకు ఉన్న రెండు ఆస్తులను స్వాధీనం చేసుకుని తమను నివాసం ఉండకుండా అడ్డుకోవడంపై ఆ వృద్ధ జంట జూలై-2023 లో మెయింటెనెన్స్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. పిటీషన్ దాఖలు చేసే సమయానికి వారి కుమారుడి వయసు 59 సంవత్సరములు. ట్రిబ్యునల్ అతన్ని ఆస్తి నుండి ఖాళీ చేయవలసినదిగా ఆదేశించి నిర్వహణ ఖర్చుల క్రింద నెలకు 3 వేల రూపాయలు చెల్లించాల్సిందిగా ఆదేశించింది. ఈ ఉత్తర్వును అప్పిలేట్ అథారిటీ సెప్టెంబరు-2024 లో సమర్థించింది. అయితే బొంబై హైకోర్టు ఏప్రిల్ 25, 2025న తన తీర్పు ద్వారా కుమారుడు జూలై 4, 1964 న జన్మించి నందున అప్పటికి అతనికి 60 ఏళ్ళు దాటిపోయాయని, అందువలన అతను కూడా ఈ చట్టంలోని సెక్షన్-2(హెచ్) ప్రకారం సీనియర్ సిటిజనేనని పేర్కొంటూ ఆ ఆస్తిని ఖాళీ చేయించాలన్న ఉత్తర్వును రద్దు చేసింది. గతంలోనూ సుప్రీం కోర్టు ధర్మాసనం ఇదే తరహా తీర్పును వెలువరించింది. జన్మనిచ్చిన అమ్మా నాన్నల సంరక్షణ, పోషణ బాధ్యత వారి కుమారులు, కుమార్తెలదేనని కూడా స్పష్టం చేసింది. వృద్ధాప్యములో తల్లిదండ్రుల బాగోగులు పట్టించుకోని బిడ్డలకు ఆస్తిని పొందే హక్కు లేదని కూడా పేర్కొనింది. ఈ కేసుకు సంబంధించి వృద్ధులైన తమ తల్లిదండ్రులను ఏ లోటు లేకుండా చూసుకుంటామని హామీ ఇచ్చి వారి నుండి ఆస్తి పొందిన కుమారుడు మాట తప్పడంతో సుప్రీం కోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. విచారించిన ధర్మాసనం గిఫ్ట్ డీడ్‌ను రద్దు పరిచి ఆ ఆస్తిపై తిరిగి తల్లిదండ్రులకు న్యాయస్థానం హక్కును పునరుద్దరింప చేసింది. ఇటువంటి వివాదాలకు సంబంధించి తల్లిదండ్రులు తమ పిల్లలకు అందించిన ఆస్తిపై యాజమాన్యపు హక్కులు తిరిగి బాధితులకే దక్కేలా ఆదేశించే అధికారం ఆ ట్రిబ్యునల్‌లకు ఉంటుందని ధర్మాసనం వెల్లడించింది. ఇదిలా ఉండగా తెలంగాణ ప్రభుత్వం కూడా సవరణ నియమావళి-2022 ను రూపొందించింది. నిరాదరణకు గురైన వారు ఆయా జిల్లాలలోని ఆర్డీవోలకు (మెయింటెనెన్స్ ట్రిబ్యునల్), జిల్లా సంక్షేమ అధికారికి పోషణ ఖర్చుల కోసం దరఖాస్తు చేసుకోవాలి. వృద్ధులు, తల్లిదండ్రులు ఎక్కడ నివసిస్తున్నారో, ఇంతకు ముందు చివరి సారిగా ఎక్కడ నివసించారు, అలాగే వారి పిల్లలు లేదా బంధువులు ఎక్కడ నివసిస్తారో వంటి వివరాలను దరఖాస్తు ద్వారా తెలపాలి. ఈ క్రమంలో బాధిత వృద్ధులు దరఖాస్తు చేసుకున్న 90 రోజుల వ్యవధిలో ట్రిబ్యునల్ పిల్లలకు నోటీసులను జారీ చేసి వాదనలు, సాక్ష్యాలను సేకరించి పోషణ ఖర్చులు చెల్లింపునకు ఆదేశిస్తుంది. 3 నెలల పాటు బాధితులకు వారి పిల్లలు పోషణ ఖర్చులకు ఇవ్వకపోతే తల్లిదండ్రులు తిరిగి ట్రిబ్యునల్‌ను ఆశ్రయించవచ్చు. ట్రిబ్యునల్ ఉత్తర్వులను పాటించని పిల్లలు, బంధువులకు జరిమానా, జైలు శిక్ష విధించే హక్కు దానికి ఉంటుంది. అలాగే పిల్లలు, బంధువులు పోషణ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తిరిగి వారి ఆస్తులను స్వాధీనం చేసుకునే హక్కు కూడా ఉంది. ఇది కాకుండా వయో భారంతో నడవలేని వయో వృద్ధులు వీల్ చైర్లు, చేతి కర్రలు, వినికిడి పరికరాలు, కళ్ళ జోళ్ళు వంటి పరికరాల కోసం దరఖాస్తు చేసుకుంటే వాటిని జిల్లా సంక్షేమ అధికారి అందజేస్తారని కూడా తెలియజేస్తూ తల్లిదండ్రులను చూడకపోతే ఆస్తికి అనర్హులేనని, అటువంటి బిడ్డలను బయటకు వెళ్ళగొట్టవచ్చని వృద్ధులకు అండగా పోషణ చట్టాలు ఉన్నాయని తే.12.9.2025 దీన భారత అత్యున్నత న్యాయ స్థానం సంచలనాత్మక తీర్పును వెలువరించింది.

CHANGE OF NAME

పేరు మార్పు నేను, నారాయణ నెల్లూరు హరీష్ కుమార్ రెడ్డి, తండ్రి: నారాయణ నెల్లూరు పెంచలయ్య, నివాసం: ఇంటి నెం. 12/11, మందరం గ్రామం, రాజంపేట మండలం, అన్నమయ్య జిల్లా, ఆంధ్రప్రదేశ్-516126. నేను నా పేరును నారాయణ నెల్లూరు హరీష్ కుమార్ రెడ్డి నుండి పెద్దిరెడ్డి హరీష్ కుమార్ రెడ్డి గా మార్చుకున్నాను. దీనికి సంబంధించి నేను 17.12.2025 తేదీన నోటరీ ముందు అఫిడవిట్ సాక్ష్యం ఇచ్చాను. ఇకపై నేను పెద్దిరెడ్డి హరీష్ కుమార్ రెడ్డి గా పిలువబడతాను.

## బద్వేలులో ప్రెస్‌క్లబ్ ఏర్పాటు చేయాలి

బద్వేలు అర్బన్, డిసెంబర్ 24, ప్రభాతవార్త



పట్టణంలో ప్రెస్ క్లబ్ ఏర్పాటు చేయాలని కోరుతూ దళిత, వామపక్ష ప్రజా సంఘాల నాయకులు ఆర్డీవో కార్యాలయ ఇన్‌చార్జి వెంకటసుబ్బయ్యకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ బద్వేలు పట్టణ కార్యదర్శి బాలు మాట్లాడుతూ, పట్టణం రోజురోజుకు అభివృద్ధి చెందుతున్నప్పటికీ ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే సరైన వేదిక లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ప్రెస్ క్లబ్ ఏర్పాటు అయితే ప్రజల సమస్యలను విలేకరుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తోడ్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పులే-అంబేద్కర్ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ముండ్లపాటి పిచ్చయ్య, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు పడిగే వెంకటరమణ, దళిత నాయకులు ముత్యాల చెన్నారాయుడు, బత్తలకూరి జార్జి, డీబీఎఫ్ రాష్ట్ర నాయకులు చిన్నయ్య, వెంకటసుబ్బయ్య ఆచారి పాల్గొన్నారు.

## జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నరసింహారెడ్డి

బద్వేలు అర్బన్, డిసెంబర్ 24 (ప్రభాతవార్త):



అఖిల భారత రెడ్డి సంఘం మీడియా విభాగం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కలసపాడు గ్రామానికి చెందిన కాతా నరసింహారెడ్డిని నియమించినట్లు రాష్ట్ర మీడియా విభాగం అధ్యకులు రాజేంద్ర రెడ్డి, అఖిల భారత రెడ్డి సంఘ వ్యవస్థాపకులు ఎన్. జగన్మోహన్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగేంద్ల వెంకటసుబ్బారెడ్డిలు తెలిపారు. నరసింహారెడ్డి గత 18 సంవత్సరాలు పత్రికలో జర్నలిస్టుగా సేవలందిస్తూ సమస్యలపై వార్తా కథనాల ఇస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు. అనంతరం నరసింహారెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో తనకు బాధ్యతలు అప్పగించినందుకు రెడ్డి సంఘం అభివృద్ధికి సాయశక్తులా కృషిచేస్తాననన్నారు. తన ఎన్నికకు సహకరించి ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## విలువలతో కూడిన విద్యను అభ్యసించాలి

చిన్నమండెం డిశంబర్ 24 ప్రభాతవార్త:



మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం దిగువగొట్టి వీడు, మల్లూరు జడ్పీహెచ్ హైస్కూల్ నందు నైతిక విలువల బోధన తరగతులను నిర్వహించినారు. ఈ సందర్భంగా చైర్మన్ జయచంద్రరెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి విలువలతో కూడిన విద్యను అభ్యసించడమే శాంతి సమాజ స్థాపనకు మార్గదర్శకమన్నారు. 9వ తరగతి నుండి పదవ తరగతికి చేరుకొన్న విద్యార్థులకు వారి ప్రతిభను గుర్తించి వారికి బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ బోర్డ్ విద్యా కమిటీ చైర్మన్ రాటాల గోపి ఉమ్మడి కడప జిల్లా వైస్ ప్రెసిడెంట్ అల్లం రెడ్డప్ప రెడ్డి రెడ్డివారిపల్లె వెంకటరామిరెడ్డి, మద్దిగా వెంకట్ రెడ్డి మానవతా యూనిట్ ప్రెసిడెంట్ కూటాల నారాయణప్ప, రిటైర్డ్ లెక్చరర్ జగన్ మోహన్ రెడ్డి, తంగాల సిద్దయ్య, పెద్దరెడ్డి, మోహన్, అల్లం మల్రెడ్డి, మల్లూరుసాయి ,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ

ఓబులవారిపల్లి డిసెంబర్ 24 ప్రభాతవార్త



మండలంలోని దాదాపు 5 పంచాయతీలలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఓబులవారిపల్లి మంగంపేట బికమ్మపల్లి చెన్నరాజుపూరు తదితర పంచాయతీలలో సుడిగాలి పర్యటన చేపట్టి. ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మరియు కూడా చైర్మన్ రూపనంద్ రెడ్డి సతీమణి మొక్కా వరలక్ష్మిలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు ఇంటి వద్దకే వెళ్లి పంపిణీ చేశారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రజా సంక్షేమ పథకాలు అలాగే ప్రజా అవసరాలు తీర్చడం ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ అందజేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు వాసుదేవరెడ్డి ప్రేమ్‌కుమార్ కోటి నాయుడు కల్లా చలపతి రమణ, గ్రామస్తులు గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఉచితంగా శుద్ధిచేసిన నీటిసరఫరా : ఎమ్మెల్యే

మదనపల్లె, డిసెంబర్ 24 ప్రభాతవార్త :



వాటర్‌ప్లాంటును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ప్రజలకు ఉచితంగా శుద్ధిచేసిన తాగునీటిని అందించడం జరుగుతుందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. బుధవారం మున్సిపాలిటి పరిధిలోని 6వ వార్డు గొల్లపల్లె ఎస్‌సి కాలనీలో మినరల్ వాటర్ ప్లాంటును ప్రారంభించారు. అనంతరం రూ.25లక్షలతో ఎస్‌సి కమ్యూనిటి హాలు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి వార్డులోనూ ప్రజలకు శుద్ధిచేసిన నీటిసరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో మినరల్ వాటర్ ప్లాంటు ద్వారా ప్రజలకు ఉచితంగా శుద్ధిచేసిన నీటిని అందిస్తున్నామన్నారు. ప్రజల ఆరోగ్యమే ప్రధాన లక్ష్యమన్నారు. రూరల్ మండలంలోని చీకలుబైలు సచివాలయాన్ని ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ ఉద్యోగుల హాజరుపట్టికను పరిశీలించి గైర్హాజరైన వివరాలను అడిగి తెలుసుకొన్నారు. విధులకు డుమ్మాకొట్టేవారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో 6వ వార్డు కౌన్సిలర్ ప్రసాద్, కమీషనర్ ప్రమీల, టిడిపి నాయకులు గురునాథ్‌యాదవ్, జేసిబి వేణు, సిమెంటు రమణ, డిఈ శ్రావణి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## పార్లమెంటరీ జిల్లా ప్రధాన కార్యదర్శికి సన్మానం

మదనపల్లె, డిసెంబర్ 24 ప్రభాతవార్త :



సన్మానిస్తున్న దృశ్యం

రాజంపేట పార్లమెంటరీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియామకమైన పఠాన్‌ఖాదర్ ఖాన్‌ను పట్టణంలో పలువురు టిడిపి నాయకులు బుధవారం సన్మానించారు. టిడిపి సీనియర్ నాయకులు, శ్రీ అయ్యప్పస్వామి ఆలయ కన్వీనర్ మార్పూరి సుధాకర్ నాయుడు జిల్లా ప్రధాన కార్యదర్శిని శాలువ కప్పి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఆయనతో పాటు టిడిపి సీనియర్ నాయకులు రాటకొండ బాబురెడ్డి, జ్ఞానాబింకా విద్యాసంస్థల అధినేత రాటకొండ గురుప్రసాద్, మాజీ ఎంపిపి జికె.వెంకటరమణ, రాష్ట్ర నాయిబ్రాహ్మణ సాధికార అధ్యక్షులు మంగళ ప్రభాకర్, బిజెపి రాష్ట్ర నాయకులు డాక్టర్ అజంతుల్లా ఖాన్‌లు పఠాన్‌ఖాదర్‌ఖాన్‌ను సన్మానించారు.

## తంబళ్లపల్లె సచివాలయానికి మోక్షం ఎప్పుడు!

తంబళ్లపల్లె డిసెంబర్ 24. ప్రభాతవార్త ః

నియోజకవర్గకేంద్రంలోని సచివాలయం పనులు పూర్తిగా కాక అసంపూర్తిగా ఉంది. సచివాలయ వ్యవస్థ వచ్చిన నాటి నుండి ఎంపీడీవో కార్యాలయం పై రూములో సచివాలయాన్ని కొనసాగిస్తున్నారు. సచివాలయ పనుల కోసం వచ్చే ప్రజలు రెండో అంతస్థులోని కార్యాలయానికి వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. సచివాలయ కాంట్రాక్టర్ తనకు బిల్లులు రావాల్సి ఉందని బిల్లులు చెల్లిస్తే పనులు పూర్తిచేసి అప్పజెప్తానని చెప్తున్నాడు. గత నెల రోజులుగా ఎంపీడీవో కార్యాలయ అధికారులు సచివాలయాన్ని ఖాళీ చేయాలని ఒత్తిడి చేస్తున్నారు. కార్యాలయం మార్చడానికి ప్రభుత్వ ఖాళీ భవనాల అన్వేషణలో పంచాయతీ అధికారులు ఉన్నారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి సచివాలయ పనులు పూర్తి కావడానికి సహకరించాల్సి ఉంది.

## క్రిస్మస్‌కు ముస్తాబైన ప్రార్థనా మందిరాలు

రామసముద్రం డిసెంబర్ 24 ప్రభాతవార్త





మండలంలో యేసుక్రీస్తు జన్మదినం, క్రిస్మస్ వేడుకలకు ప్రార్థనా మందిరాలు ముస్తాబవుతున్నాయి. మండలంలోని ప్రేమ స్వరూపి ప్రార్థన మందిరం, బేబతే ఉసియోస్, బేతస్త, కర్ణాటక భార్డర్ గూకుంట గ్రామంలో ఉన్న వందల ఏళ్లనాటి చరిత్ర కలిగిన సెంటా ఫ్రాన్సిస్ క్లేవియర్ ప్రార్థన మందిరాల్లో దీపాలంకరణ చేశారు. పలు చర్చిల్లో రెల్లిగడ్డి తో పాకనిర్మించి విగ్రహాలను ఏర్పాట్లు చేశారు. చర్చ్ లలో ఇతర రాష్ట్రాలనుండి ప్రత్యేక ప్రార్థనలు చేయడానికి మందిరాలకు వస్తారని ఫాస్టర్ లు గ్రామస్థులు తెలిపారు. ప్రార్థన మందిరాలు కలిగిన గ్రామాలు క్రిస్మస్ పండుగ వాతావరణం నెలకొన్నది.

## పంచాయతీల సందర్శన

రామసముద్రం డిసెంబర్ 24 ప్రభాతవార్త



మండలంలోని రామసముద్రం, చొక్కాండ్ల పల్లె గ్రామ పంచాయతీలలో డిప్యూటీ ఎంపిడిఓ గఫూర్ బుధవారం సందర్శించారు. చొక్కాండ్ల పల్లె గ్రామ పంచాయతీలో డోర్ టూ డోర్ గార్బెజ్ కలెక్షన్ కార్యక్రమాన్ని గ్రీన్ అంబాసిడర్లు ద్వారా నిర్వహించారు. ప్రజలకు చెత్తను వేరు చేసి ఇవ్వడం, పరిశుభ్రత ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు. మండల కేంద్రంలోని గుంతలపేట గ్రామంలో స్వామిత్వ సర్వేలో డిప్యూటీ ఎంపిడిఓ గఫూర్ మండల సర్వేయర్ నరేంద్ర, పంచాయతీ కార్యదర్శి మునిస్వామినాయక్, పంచాయతీ సర్వేయర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో అసైన్మెంట్ భూములు మినహాయించి గ్రామ కంఠాలను తేల్చేలా సర్వే చేపట్టారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఓ గఫూర్, పంచాయతీ కార్యదర్శులు భానుమూర్తి, మునిస్వామి నాయక్,గ్రామస్థులు,గ్రీన్ అంబాసి డర్లు పాల్గొన్నారు.

## నూరు శాతం ఫలితాలు సాధించాలి

కురబలకోట డిసెంబర్ 24 ప్రభాతవార్త



పదవ తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించడానికి ఉపాధ్యాయులు చిత్తశుద్ధితో కృషి చేయాలని మదనపల్లి ఉపవిద్య శాఖ అధికారి లోకేశ్వర్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కురబలకోట, తెట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించడానికి మై ఫ్రెండ్ మై స్కూల్ కార్యక్రమాన్ని అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతి విద్యార్థుల కోసం నూరు శాతం ఉత్తీర్ణ సాధించడానికి వందరోజుల కార్యక్రమాన్ని అమలను గురించి పరిశీలించారు. 10వ తరగతి, 9వ తరగతి విద్యార్థులతో ఆయన ముచ్చటించారు. పదవ తరగతి విద్యార్థులు అందరూ పాస్ కావడానికి వందరోజుల విద్యా కార్యక్రమాన్ని తప్పనిసరిగా అనుసరించాలని దీన్ని అనుసరిస్తే పబ్లిక్ పరీక్షల్లో బాగా రాయడానికి తర్ఫీదు పొందుతారని విద్యార్థులకు ఆయన సూచించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. రికార్డులను పరిశీలించారు. తెట్టు ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం తయారు చేస్తున్న పరిసరాలను వంట సామాగ్రిని పరిశీలించారు. ఎంఈఓ 2 శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు శ్రీదేవి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అన్నీ తామై అంత్యక్రియలు

ప్రొద్దుటూరు అర్బన్, డిసెంబర్ 24,ప్రభాతవార్త



స్థానిక అమ్మ నాన్న వృద్ధాశ్రమం నందు వెన్నపూస రాములమ్మ అనారోగ్యం చేత మరణించగా అంతిమ సంస్కరణలు చేయడానికి బంధువులు ఎవరు ముందుకు రాకపోవడంతో వృద్ధాశ్రమం నిర్వాహకులు ఫోన్ ద్వారా మే ఐహెల్ప్యు ఫౌండేషన్ టౌన్ ప్రెసిడెంట్ సుబహాన్‌ను సంప్రదించగా వారు స్పందించి బుధవారం హిందు స్మశాన వాటికలో హిందూ సంప్రదాయం ప్రకారంగా అంతిమ సంస్కరణలు నిర్వహించారు. ఇటువంటి గొప్ప కార్యక్రమానికి చేయూత అందించిన ఫౌండేషన్ చైర్మన్ మోరే లక్ష్మణ్ రావు,టౌన్ ప్రెసిడెంట్ సుబహాన్, కృప ఆగ్ని షారోన్ ట్రస్ట్ సభ్యులు పాపిశెట్టి వెంకట లక్షుమ్మ ప్రసన్న కుమార్, సురేష్ పాల్,సుమన్ బాబులకు కృతజ్ఞతలు తెలిపారు.

## రామసముద్రం మండలంలో భూవివాదం

మదనపల్లె క్రైమ్, డిసెంబర్ 24 ప్రభాతవార్త.



రామసముద్రం మండల పరిధిలోని నారావారిపల్లిలో భూవివాదం నేపథ్యంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. 60 ఏళ్లగా సాగు చేసుకుంటున్న భూమిని లాక్కోవడానికి కొందరు వ్యక్తులు మారణాయుధాలతో దాడికి దిగారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. నారేవారిపల్లెకు రామక్రిష్ణప్ప కుమారుడు వాసు, తన కుటుంబ సభ్యులు కలిసి గత 6 దశాబ్దాలుగా తమ స్వాధీనంలో ఉన్న భూమిలో 5 ఆవులతో షెడ్డు ఏర్పాటు చేసుకుని జీవనోపాధి సాగిస్తున్నారు. అయితే, ఇదే గ్రామానికి చెందిన కొందరు అక్కడి నుండి ఖాళీ చేయించడానికి నిరంతరం వేధింపులకు గురిచేస్తున్నాడని బాధితులు ఆరోపించారు. మంగళవారం మారణాయుధాలతో తమను చుట్టు ముట్టారన్నారు. పరిస్థితి తీవ్రం కావడంతో 100 కు ఫోన్ చేయగా, రామస ముద్రం పోలీసులు అక్కడికి చేరుకుని దుండగులను పంపించివేశారు. వారి నుంచి తమకు ప్రాణహాని ఉందని తెలిపారు. అనంతరం రూరల్ సిఐ రవి నా యక్ ఫిర్యాదు చేశారు.

## కంపచెట్లతో కమ్మేసిన మ్యాజిస్ట్రేట్ కోర్టు రహదారి

తంబళ్లపల్లె డిసెంబర్ 24 ప్రభాతవార్త ః



నియోజకవర్గ కేంద్రంలోని కోర్టు రహదారి ముండ్ల చెట్లతో కమ్మేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రహదారిలో కోర్టుతో పాటు బీసీ బాలుర గురుకులం, సచివాలయం, జగనన్న కాలనీ, సాయిబాబా గుడి, ఇట్నేని వారి పల్లి, అక్కమ్మ చెరువుకు ఇదే రహదారి కావడంతో నిత్యం వందలాదిమంది రాకపోకలు సాగిస్తారు. రహదారి కంపచెట్లతోఇరుకుగా ఉండడంతో పలువురు ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి చెట్ల తొలగింపు చేపట్టాల్సి ఉంది.

## క్రిస్మస్ సందర్భంగా విద్యుత్ దీపాలతో అలంకరణ

మైదుకూరు, డిసెంబర్ 24, ప్రభాతవార్త:



మైదుకూరు పట్టణ కడప రోడ్డు సిఎస్ఐ చర్చిలో క్రిస్మస్ సందర్భంగా విద్యుత్ దీపాల అలంకరణతో ఏర్పాటు చేశారు. ప్రతి సంవత్సరం డిసెంబర్ 25న క్రిస్మస్ వేడుకలు సందర్భంగా సి.యస్ఐ. చర్చి పాస్టర్ ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ క్రీస్తు జననం లోకానికి రక్షణ, విమోచన తెచ్చింది. అందుకే క్రీస్తు జననం లోకానికి శుభవర్తమానం ప్రజలు అందరు సంతోషంగా క్రిస్టమస్ ఆరాధనలో పాల్గొని క్రీస్తు జనన ఆశీస్సులు పొందాలని ప్రజలు అందరు సుఖశాంతులతో ఆనందంగా ఉండాలని ఏసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని క్రైస్తవులు జరుపుకునే పండుగలలో ఇది ముఖ్యమైనది తెలిపారు. అంతేకాకుండా మండలంలో అనేకచోట్ల క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరగనున్నాయి.

## విద్యార్థులు తమ భవిష్యత్తు ఎలా ఉండాలి..

సుండుపల్లె, డిసెంబర్ 24,ప్రభాతవార్త :



జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సుండుపల్లె నందు కెరీర్ గైడెన్స్ వృత్తి ఎంపిక ప్రదర్శనలో భాగంగా మండలంలోని ఉన్నత పాఠశాలల నుండి విద్యార్థులు తమ భవిష్యత్తు ఎలా ఉండాలి అనే లక్ష్యంతో ఉత్తమ నైపుణ్యాలైన డాక్టరు, ఇంజనీరు, రైతు, పైలట్, చెఫ్, పోలీస్ వంటి వృత్తి నైపుణ్యాలను ప్రదర్శించారు. ఈ, ప్రదర్శనలు ఆరు ప్రధాన కేటగిరీల లో నిర్వహించారు. అనంతరం వివిధ పాఠశాలల విద్యార్థులు ఎగ్జిబిట్ ప్రదర్శనను చేపట్టారు మరియు డ్రాయింగ్ కాంపిటీషన్లో విద్యార్థినీ విద్యార్థులు తమ నైపుణ్యాలను చాటారు. సంబంధిత కేటగిరీలలో జిల్లాస్థాయికి ఎంపిక చేయడం జరిగింది. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి1 బి వెంకటేష్ నాయక్, మండల విద్యాశాఖ అధికారి2 రవీంద్ర నాయక్, పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు డి నాగార్జున, ట్రైబల్ స్కూల్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, వివిధ పాఠశాలల నుండి వచ్చినటువంటి ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

## బెంగళూరు కంపెనీతో మీట్స్ ఎంఓయు

కురబలకోట డిసెంబర్ 24 ప్రభాతవార్త



కురబలకోట మండలం అంగళ్లుకు సమీపాన ఉన్న మిట్స్ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం వారు మీట్స్ ఐఐఐ సి వారి ఆధ్వర్యంలో బెంగళూరుకు చెందిన ఉల్లే మియా ఇన్ఫోసిస్ టెక్నాలజీస్ ప్రైవేట్ కంపెనీ మధ్య పరిశ్రమ విద్యా సహకారాన్ని బలోపేతం చేయడానికి అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. రామనాథన్ తెలిపారు. ఉల్లేమియా ఇన్ఫోసిక్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో చరణ్ గుడివాడ మరియు మీట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామనాథన్‌లు అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో చరణ్ గుడివాడ మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక ప్రపంచంలో సురక్షితమైన మరియు విశ్వసనీయమైన డిజిటల్ వ్యవస్థల కోసం కృత్రిమ మేధస్సు తో కూడిన సైబర్ సెక్యూరిటీ వ్యవస్థ అనివార్యమైందని తెలిపారు. ఆధారిత సెక్యూరిటీ వ్యవస్థలు భారీ పరిణామములు ఉన్న నెట్వర్క్ యూజర్ డేటాను వేగముగా విశ్లేషించి అనుమానాస్పద కార్యకలాపాలను గుర్తించల వని అన్నారు. అకాడమీ మరియు పరిశ్రమల మధ్య అంతరాన్ని తగ్గించడం మరియు మిషన్ లెర్నింగ్ లో విద్యార్థులకు అత్యాధునిక పరిజ్ఞానం మరియు నైపుణ్యాలను సమకూర్చడం కోసం ఈ ఎం ఓ యు మరో మైలురాయిని సూచిస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో విభాగ అధిపతి డాక్టర్ పద్మ, కోఆర్డినేటర్ శాయిజ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

బద్వేలు, డిసెంబర్ 25, ప్రభాతవార్త



బద్వేల్ నియోజకవర్గంలో పలువురు లబ్ధిదారులకు బుధవారం టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి కే. రితీష్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా రూ.19,64,872 విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రితీష్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా బద్వేల్ నియోజకవర్గంలోని అనేకమందికి వైద్య అవసరాల కోసం ఆర్థిక సహాయం అందడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో బద్వేల్ టౌన్ అధ్యక్షులు గుర్రంపాటి వెంగల్ రెడ్డి, టీడీపీ పట్టణ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 15 ఎర్రచందనం దుంగలు పట్టివేత

### తమిళ కూలీ అరెస్ట్

సిద్దవటం డిసెంబర్24 ప్రభాతవార్త



15 ఎర్రచందన దుంగలను పట్టుకుని తమిళ కూలీని అరెస్ట్ చేసినట్లు రేంజర్ కళావతి తెలిపారు. సిద్దవటం అటవీశాఖ కార్యాలయంలో బుధవారం రేంజర్ మాట్లాడుతూ కడప డిఎఫ్ఓ వినీత్ కుమార్ ఆదేశాల మేరకు కూంబింగ్ నిర్వహించామన్నారు. సిద్దవటం రేంజ్ లోని గొల్లపల్లి బీటు, గొల్లపల్లి సెక్షన్ నల్ల బండలు, సాలు పెంట ప్రదేశంలో కొందరు ఎర్రచందనం దుంగలు మోసుకొని వెళ్తుండగా దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో 15 ఎర్రచందనం దుంగలను పట్టుకుని ఒక తమిళ కూలీని అరెస్ట్ చేశామన్నారు. పట్టుకున్న దుంగలు 479 కేజీ లు ఉన్నాయని రూ. 1.39 లక్షలు విలువ చేస్తాయన్నారు. పరారయిన నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టామన్నారు. పట్టుబడిన నిందితుడిపై కేసు నమోదు చేసి తిరుపతి కోర్టుకు హాజరు పరచడం జరిగిందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ ఓబులేసు, గొల్లపల్లి ఎఫ్బీఓ మధు, సిద్దవటం ఏబీఓ హైమావతి, ప్రొటెక్షన్ వాచర్లు, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## బండారు సూర్యనారాయణకు ఘన సత్కారం

ప్రొద్దుటూరు డిసెంబర్ 24 ప్రభాతవార్త



పట్టణంలోని తొగట వీర క్షత్రియ కళ్యాణ మండపం అధ్యక్షునిగా ఎన్నికైన కడప జిల్లా తొగట వీర క్షత్రియ సంక్షేమ సేవా సంఘం అధ్యక్షులు బండారు సూర్యనారాయణను దేవాంగ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ రాగా నరసింహారావు ఘనంగా సత్కరించారు. బుధవారం బండారు సూర్యనారాయణ నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఇటీవల ఎంతో ఉత్కంఠ గా జరిగిన ఎన్నికలలో బండారు సూర్యనారాయణ అఖండ విజయం సాధించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా తొగట వీర క్షత్రియ కళ్యాణ మండపం అభివృద్ధికి కృషి చేయాలని ఆయన ఆకాంక్షి ంచారు. ఈ కార్యక్రమంలో కుల బాంధవులు పాల్గొన్నారు.

## అబద్దానికి ఆయువు తక్కువ, నిజం బయటపడక తప్పదు

కడప కార్పొరేషన్, డిసెంబర్ 24 ప్రభాతవార్త:



గత సార్వత్రిక ఎన్నికలలో అరాచకం, విధ్వంసం, వినాశనం, ఆర్థిక సంక్షోభం, కల్తీ మద్యం అంటూ అప్పటి వైసిపి పాలనపై టిడిపి నాయకులు దుష్ప్రచారం చేశారని, ప్రజలను గందరగోళంలోకి నెట్టారని వైసిపి వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్.నాగార్జున్ రెడ్డి విమర్శించారు. ఎన్నికల్లో లబ్ధి పొంది అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం ఆగిపోయిందని, ప్రజలను పట్టించుకోలేదని మండిపడ్డారు. బుధవారం కడప నగరంలో వైసిపి కార్యాలయంలో మీడియా సమావేశంలో డాక్టర్ నాగార్జున రెడ్డి మాట్లాడుతూ జగన్ పాలనలో స్థూలము వృద్ధిరేటు (జీఎస్‌డిపి)7.9 శాతం నుంచి 12.9శాతం రెట్టింపు అయిందన్నారు. కాగ్ రిపోర్ట్ ప్రకారం 2014-19 కాలంలో సగటు అప్పు పెరుగుదల 23 శాతం ఉండేదని, 2019-23 సగటు అప్పు పెరుగుదల 14 శాతం మాత్రమేనన్నారు. బాబు పాలనలోని అప్పులు అధికంగా చేశారని దుయ్యపుట్టారు. కల్తీ మద్యం తాగి మరణాలు సంభవించాయని టిడిపి నాయకులు దుష్ప్రచారం చేశారని, ఒక్కమరణం కూడా జరగలేదు కేంద్ర ప్రభుత్వ సంస్థ నివేదిక ఇచ్చిందని గుర్తు చేశారు. 2019-24 ఐదేళ్ల జగన్ పాలనలో పరిశ్రమల వృద్ధి ఆర్బిఐ నివేదిక ప్రకారం ఏపీలో సగటు 11.12 శాతంతో దేశంలో 5వ స్థానం, దక్షిణ భారత దేశంలో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. కేంద్ర రక్షణ నివేదిక ఇచ్చిన ప్రకారం ఆంధ్ర లో ఉత్తమ పోలీసింగ్ నమోదయినట్లు చెప్పారన్నారు. జగన్ జన రంజిక పాలన చేశారు అన్నారు. కరోనా కాలంలో కూడా అర్హులైన వారికి బ్యాంకు ఖాతాలో నేరుగా నగదు బదిలీ జరిగిందన్నారు.

## వినియోగదారుల హక్కులపై అవగాహన అవసరం

మైదుకూరు, డిసెంబర్ 24, ప్రభాతవార్త:





ప్రభుత్వ డిగ్రీ కళాశాల వాణిజ్యశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో, ప్రిన్సిపల్ డాక్టర్ పి. నారాయణరెడ్డి అధ్యక్షతన, జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని అధ్యాపకులు, విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ పి. నారాయణ రెడ్డి మాట్లాడుతూ, వినియోగదారుల హక్కులు మరియు వాటికి సంబంధించిన చట్టాలపై అవగాహన ప్రతి ఒక్కరికీ ఎంతో అవసరమన్నారు. ఏదైనా వస్తువును కొనుగోలు చేసినప్పుడు దానికి సంబంధించిన రసీదు మరియు గ్యారెంటీ పత్రాన్ని తప్పనిసరిగా తీసుకొని, అవసరమైనప్పుడు వాటిని వినియోగించుకుంటే నష్టాలను నివారించవచ్చని ఆన్‌లైన్ మాధ్యమాలైన అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఈకామర్స్ వేదికల ద్వారా వస్తువులు కొనుగోలు చేసే సమయంలో, ఆ వస్తువుకు సంబంధించిన రివ్యూలను తప్పనిసరిగా పరిశీలించి, నాణ్యతను గమనించాలన్నారు. అనంతరం కళాశాల విద్యార్థులు వినియోగదారుల హక్కులపై తమ అభిప్రాయాలను వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో వాణిజ్యశాస్త్ర అధ్యాపకులు చెన్న రాయుడు, కళాశాల వైస్ ప్రిన్సిపల్ సుభాన్ సాహెబ్, అనురాధ లక్ష్మి, డాక్టర్ పి.వి. కృష్ణారెడ్డి, డాక్టర్ సి. నర్సింహారావు, నవనీశ్వర్ రెడ్డి, అయ్యవారి రెడ్డి, సుధీర్ రెడ్డి, శ్రీనివాసులు తదితర అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## గుండ్లపల్లి పంచాయతీలో విద్యుత్ కేబుల్ వైర్ల చోరీ

తంబళ్లపల్లె డిసెంబర్ 24 ప్రభాతవార్త ః



మండలంలోని గుండ్లపల్లి పంచాయతీలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు రైతుల వ్యవసాయ బోర్ల కేబుల్ వైర్ల తోబాటు పంచాయతీ తాగునీటి బోర్ల కేబుల్ వైర్లు సైతం చోరీ చేశారు. గోపి దిన్నే పంచాయతీలోని కే.బితాండ నుండి గుండ్లపల్లి పంచాయతీ తోబాటు మొలకలచెరువు మండలం దేవలచెరువు ప్రాంతంలో సైతం పలుచోట్ల ఈ దుండగులు కేబుల్ వైర్లు చోరీకి పాల్పడ్డారు. ఈ కేబుల వైర్ల చోరీ విషయమై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేబుల్ వైర్ల చోరీ పై గుండ్లపల్లి సర్పంచ్ మోలాలి తంబళ్లపల్లె పోలీస్ స్టేషన్ తో పాటు మండల పరిషత్ అధికారులకు సైతం ఫిర్యాదు చేశారు.

## గుర్తుతెలియని వ్యక్తికి తీవ్ర గాయాలు

నందలూరు, డిసెంబర్ 24 ప్రభాతవార్త :

రైల్వేస్టేషన్ యార్డ్ సమీపంలో మంగళవారం రాత్రి 11:45 గంటల సమయంలో సుమారు 30 ఏళ్ల వయస్సు గల గుర్తుతెలియని పురుషుడు రైల్వే ట్రాక్‌పై వెళ్తున్న గూడ్స్ రైలు కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వ్యక్తిని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించగా ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. ఈ సందర్భంగా జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ సుభాన్ మాట్లాడుతూ బాధితుడు ప్రస్తుతం మాట్లాడలేని స్థితిలో ఉన్నాడని తెలిపారు. బాధితుడి చిరునామా వివరాలు తెలియాల్సి ఉందని పేర్కొంటూ, వివరాలు తెలిసిన వారు కడప రైల్వే పోలీసులను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

పీలేరు డిసెంబర్ 24 ప్రభాతవార్త:



రక్తదానం నిర్వహిస్తున్న సభ్యులు

పీలేరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం విజయవంతంగా నిర్వహించారు. స్థానిక తిరుపతి రోడ్డులోని లయన్స్ భవన్ ఆవరణంలో తిరుపతి స్విమ్స్ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ సహకారంతో ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో క్లబ్ అధ్యక్షులు నాగబాలాజీ, సభ్యులు వెంకట సురేష్, శ్రీనివాసులు రెడ్డి రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. ఈ కార్యక్రమంలో సిఎన్ఆర్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విద్యార్థులు, చైతన్య కళాశాల విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ యువత ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. ఈ రక్తదాన శిబిరం ద్వారా మొత్తం 48 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో, కార్యదర్శి విజయ్ భాస్కర్ రెడ్డి, మహేష్, శశిధర్ రెడ్డి, పురం బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు

గాలివీడు, డిసెంబర్ 24(ప్రభాతవార్త):



మండల కేంద్రంలోని శ్రీ రవిచంద్ర సీబీఎస్ఈ స్కూల్ అండ్ జూనియర్ కళాశాల, గౌతమ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో బుధవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం షింటో ఇమ్మానెయుల్, సైజు థామస్‌లు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఈ పండుగను జరుపుకుంటారన్నారు. ఈ పండుగ శాంతి, దానధర్మాలకు ప్రతీక అన్నారు. అనంతరం చిన్నారులు వేషధారణలు అందరినీ ఆకట్టుకున్నాయి. క్రిస్మస్ పండుగ సందర్భంగా బహుమతులు ఇచ్చి పుచ్చుకోవడం, శాంతాక్లాజ్ వంటి సంప్రదాయాలతో ఈ వేడుకలు జరుపుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ లిజాజాయ్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : సీఐ

గాలివీడు, డిసెంబర్ 24(ప్రభాతవార్త):



సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని లక్కిరెడ్డిపల్లి సీఐ కృష్ణంరాజు నాయక్ తెలిపారు. బుధవారం గాలివీడు బాలికోన్నత పాఠశాల, బస్టాండు ఆవరణంలో శక్తి టీం ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ మోసాలు, బాల్య వివాహాల నివారణ, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలు, మహిళల భద్రతకు ఉపయోగపడే శ్రీశక్తి యాప్ వినియోగంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించామని తెలిపారు. ముఖ్యంగా అనుమానాస్పద కాల్స్, లింక్స్‌కు స్పందించవద్దని, వ్యక్తిగత సమాచారం ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు. అలాగే బాలికలకు సంబంధించి ఫోక్సో చట్టం, కొత్త చట్టాల ముఖ్యాంశాలు, మహిళల రక్షణకు ప్రభుత్వం తీసుకువచ్చిన చర్యలపై ప్రత్యేకంగా అవగాహనా సదస్సు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గాలివీడు ఎస్ఐ రామకృష్ణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన డిఎస్పి

కలసపాడు, డిసెంబర్ 24 ప్రభాతవార్త:

కలసపాడు మండల కేంద్రంలో బుధవారం మైదుకూరు డిఎస్పి పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయన వెంట పోరుమామిళ్ల సిఐ కూడా ఉన్నారు. ఇద్దరు కలిసి ఫైళ్లను వెరిఫికేషన్ చేశారు. ఫైల్ అన్ని బాగానే ఉన్నాయని ఎస్ఐ సుభాన్ కు కొన్ని సూచనలు సలహాలు ఇచ్చారు.



# వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలి






రాయచోటి, ప్రభాతవార్త డిసెంబర్ 24

వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేలా అధికారులు నిరంతరం చర్యలు చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్ రావు సూచించారు. బుధవారం రాయచోటి డైట్ కళాశాలలో జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో జాతీయ వినియోగదారుల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిఆర్ఓ మధుసూదన్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల హక్కులను పరిరక్షించడం, తప్పుదోవ పట్టించే ప్రకటనలు, లోపభూయిష్ట ఉత్పత్తుల నుండి రక్షణ కల్పించడం, ఫిర్యాదులకు సత్వర పరిష్కారం అందించడం వినియోగదారుల సంరక్షణ చట్టం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ ఏడాది జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని డిజిటల్ న్యాయం ద్వారా సమర్థవంతమైన మరియు వేగవంతమైన పరిష్కారం" అనే ఇతివృత్తంతో జరుపుకుంటున్నామని చెప్పారు. డిజిటల్ న్యాయ వ్యవస్థ ద్వారా సమయం ఆదా కావడమే కాకుండా వేగవంతంగా న్యాయం అందుబాటులోకి వస్తుందన్నారు. ఆన్‌లైన్ లావాదేవీల్లో జరుగుతున్న మోసాల పట్ల వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వై. సుమతి మాట్లాడుతూ తూకాల్లో మోసం జరిగినా, నాణ్యతలేని వస్తువులు విక్రయించినా, రైల్వే, విమానయానం, విద్యుత్, గ్యాస్, కొరియర్ సేవలు, ఫుడ్ డెలివరీ, ఆన్‌లైన్ వ్యాపారాల్లో లోపాలు ఎదురైనా సంబంధిత వ్యక్తులు లేదా సంస్థలపై ఫిర్యాదు చేయవచ్చన్నారు. డిజిటల్ న్యాయ వ్యవస్థ ద్వారా వినియోగదారుల కేసులకు సత్వర పరిష్కారం లభిస్తోందని తెలిపారు. ఇందుకోసం జిల్లా స్థాయిలో జిల్లా కమిషన్, రాష్ట్ర స్థాయిలో రాష్ట్ర కమిషన్, జాతీయ స్థాయిలో జాతీయ కమిషన్‌లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే వినియోగదారుల హక్కులు, కొనుగోలు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పెంచుకోవాలన్నారు. పాఠశాలల్లో వినియోగదారుల క్లబ్‌ల ద్వారా ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులతో వినియోగదారుల ప్రతిజ్ఞ చేయించారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో ఆంగ్లం మరి యు తెలుగు మీడియం వారీగా ప్రథమ బహుమతికి 5000, ద్వితీయ బహుమతికి 3000, తృతీయ బహుమతికి 2000 చొప్పున అందజేసి, ప్రశంసా పత్రాలు, మెడల్స్ విజేతలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పబ్లిక్ హెల్త్ నర్సింగ్ అధికారి శోభలత, జిల్లా తూనికలకొలతల ఇన్‌స్పెక్టర్ దివ్య, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి షమీం భాష, రాయచోటి జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ షేక్ సుమయ, మదనపల్లి జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ చిరంజీవి, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్, డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మడితాటి నరసింహారెడ్డి, సీనియర్ అసిస్టెంట్ బాలాజీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## గౌతమి కళాశాల విజయకేతనం




ప్రొద్దుటూరు డిసెంబర్ 24 ప్రభాతవార్త

ప్రొద్దుటూరు మండల పరిధిలోని గౌతమి మహిళా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినిలు కడపలో నిర్వహించిన ఐపిఎస్జిఎం 2025 క్రీడా పోటీలలో పాల్గొని విజయకేతనం ఎగురవేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ వైసీ ప్రకాష్ రావు తెలిపారు. అందులో భాగంగా సెటిల్ బ్యాట్మెంటన్ సింగిల్స్ నందు ప్రథమ సంవత్సరం విద్యార్థిని బి రాహేల్ సబాటిని, టేబుల్ టెన్నిస్ సింగిల్స్ నందు రెండవ సంవత్సరం విద్యార్థిని ఎం జువేద, డబుల్సు నందు ఎం జుబేదా మరియు జి నవ్య విజేతలుగా నిలిచారన్నారు అలాగే వాలీబాల్ క్రీడా పోటీ నందు రన్నర్స్‌గాను, కోకో క్రీడా పోటీ నందు తృతీయ స్థానంలో నిలిచారన్నారు. స్పోర్ట్స్ నందు 4100 రిలే నందు అశ్విని తేజస్విని కె సోనీ భాయ్ జీ రమాదేవి ద్వితీయ స్థానం సాధించారన్నారు. హాయ్ జంప్ నందు వై అశ్విని ద్వితీయ స్థానం సాధించి ఆల్ రౌండ్ ప్రతిభ కనబరిచారని కళాశాల ఫిజికల్ డైరెక్టర్లు జీవో భయ్యా మరియు కె బెన్నీ మార్క్స్ లు తెలిపారు. విజయం సాధించిన విద్యార్థినులు జనవరి నెలలో తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి పాలిటెక్నిక్ కళాశాలల క్రీడా పోటీల యందు పాల్గొంటారని తెలిపారు కళాశాల కరస్పాండెంట్ బాబమ్మ డైరెక్టర్లు నాగూరు రవీంద్రారెడ్డి గో డైరెక్టర్ శైలుష ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం రామసుబ్బమ్మ మరియు వివిధ విభాగాధిపతులు ఆలీ జాబీర్ సుకుమార్ విజయమ్మ మరియు అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులను అభినందించారు.

## నేడు బిజీ వేముల వీరారెడ్డి 25వ వర్ధంతి

బద్వేలు, డిసెంబర్ 25, ప్రభాతవార్త



దివంగత మాజీ మంత్రివర్యులు, అపర చాణిక్యుడు బద్వేలు పెద్దాయనగా పేరుగాంచిన బిజీవేముల వీరారెడ్డి 25వ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆయన కుమార్తె మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, మనవడు రితేష్ రెడ్డిలు పేర్కొన్నారు. ఆయన సేవల గురించి తెలియజేస్తూ సర్పంచిగా రాజకీయాలలోకి వచ్చి మంత్రిగా సేవలందించి, పట్టుదల, ధైర్యం కలిగిన నాయకుడిగా, విద్యాప్రదాతగా బద్వేల్ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన గొప్ప నాయకుడు వీరారెడ్డి అని కొనియాడారు. ఎన్నో సేవలందించిన వీరారెడ్డి నేటి వరకు ప్రజల మనసులలో చిరస్థాయిగా నిలిచారనడములో అతిశయోక్తి లేదు. అటువంటి దివంగత మంత్రి జీవేముల వర్ధంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే పలువురు మంత్రులు, జిల్లా ఇన్చార్జులు, నాయకులు బద్వేల్ కు చేరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమం వివరాలను తెలియజేస్తూ ఉదయం 9:00 గంటలకు – ఆయన ఘాట్ వద్ద నివాళులర్పణ ఉదయం 10:30 గంటలకు – ఎస్‌బీఐ నాలుగు రోడ్ల కూడలి విగ్రహం వద్ద ప్రముఖులచే నివాళులర్పణ, అనంతరం ఎస్.వి.ఆర్. గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం, సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడనున్నాయి. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అందువల్ల బద్వేల్ నియోజకవర్గ ప్రజలు, వారి కుటుంబ సభ్యులు, అభిమానులు మరియు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ఈ కార్యక్రమానికి హాజరై, బిజీవేముల వీరారెడ్డి ఘాట్ వద్ద నివాళులర్పించి కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా కోరడమైనది.

## జేఎన్‌టియు సౌత్‌జోన్ జట్టుకు ఆదిత్య విద్యార్థులు

మదనపల్లె, డిసెంబర్ 24 ప్రభాతవార్త :


విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

జేఎన్‌టియు ఎ సౌత్‌జోన్ హాకీ జట్టుకు ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి తెలిపారు. ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్ చదువుతున్న విద్యార్థులు టి.తరుణ్‌రెడ్డి, సి.హిమేష్‌రెడ్డి, కలికిరి జేఎన్‌టియు కళాశాలలో జరిగిన హాకీ పోటీల్లో ప్రతిభ కనపరచి సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్శిటి హాకీ జట్టుకు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులను ఆయన అభినందించారు. క్రీడల్లో రాణించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అదిరోహించి కళాశాలకు, తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తేవాలని కోరారు. కళాశాల ఛైర్మెన్ ఆర్.రామ్మోహన్‌రెడ్డి, అధ్యక్షులు నాగమల్లారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రాముడు, ఫిజికల్ డైరెక్టర్లు విద్యార్థులను అభినందించారు.

## ఇస్రో ఎల్‌విఎమ్ 3ఎమ్ 6 ఘన విజయం

పులివెందుల, డిసెంబర్ 24, ప్రభాత వార్త :



భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన బాహుబలి ఎల్ వి ఎమ్ 3ఎమ్ 6 రాకెట్ ప్రయోగం విజయవంతంగా పూర్తై, 'బ్లూ బర్డ్ బ్లాక్2' ఉపగ్రహాన్ని నిర్దిష్ట కక్ష్యలోకి ప్రవేశపెట్టడం దేశానికి గర్వకారణమని పశ్చిమ రాయలసీమ జిల్లాలు పట్టభద్రుల శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ విజ యంతో భారతదేశం అంతరిక్ష సాంకేతికతలో తన విశ్వసనీ యతను మరోసారి ప్రపంచా నికి చాటిందన్నారు. అత్యంత క్లిష్టమైన ఈ ప్రయోగాన్ని ఇస్రో శాస్త్రవేత్తలు సమర్థవంతంగా పూర్తి చేయడం దేశ యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నా రు. ఎల్ వి ఎమ్ 3 రాకెట్ సామర్థ్యం భవిష్యత్తులో మరిన్ని కీలక అంతరిక్ష ప్రయోగాలకు దోహదపడు తుందని తెలిపారు. ఈ విజయం భారతదేశాన్ని అంతర్జాతీయ అంతరిక్ష రంగంలో మరింత ముందుకు నడిపిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఇస్రో చైర్మన్, శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, సాంకేతిక సిబ్బంది అందరికీ శ్రీ రామగోపాల్ రెడ్డి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

విద్యార్థులు క్రమశిక్షణతో

## ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చు





పులివెందుల , డిసెంబర్ 24 , ప్రభాత వార్త :

విద్యార్థులలో క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని తపస్య జూనియర్ కళాశాల కరస్పాం డెంట్ చంద్ర ప్రసాద్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణం లోని తపస్య జూనియర్ కళాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థులు చీరియో 2025 వీడ్కోలు సభ ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీకర ఫంక్షన్ హాల్ నందు నిర్వహించిన వీడ్కోలు సభలో విద్యార్థులను ఉద్దే శించి కళాశాల కర స్పాండెంట్ చంద్ర ప్రసాద్ రెడ్డి మాట్లాడు తూ ప్రతి విద్యార్థి భవిష్యత్ ఇంటర్ మీడియట్ తోనే ఖరారు అవుతుందని, కావున క్రమశిక్షణతో పట్టుదలతో విద్యను అభ్యసించి బంగారు భవిష్యత్ కు బాటలు వేసుకోవాలి అని అన్నారు. విద్యార్థిని విద్యార్థులు కళాశాలలోని వనరులతో పాటు అధ్యాపకుల అనుభవాలను విద్యా జ్ఞానాన్ని వినియోగించుకొని ఉజ్వల భవిష్యత్తును దిద్దుకోవాలని తెలియజేశారు. అనంతరం ప్రిన్సిపాల్ రవి శంకర్ రెడ్డి మాట్లాడుతూ క్రమశిక్షణతో మెలిగి బాగా చదివి కళాశాలకు మీ తల్లి దండ్రులకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యపు కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోండి

దువ్వూరు, డిసెంబర్ 24, ప్రభాతవార్త:

మండలంలో కేసీ కెనాల్, తెలుగు గంగా, కుందూనది ప్రాంతాలలో వరి సాగు చేసిన రైతులకు ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధరతో కొనేందుకు వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందని వాటిని రైతులు వినియోగించుకోవాలని మండల వ్యవసాయ అధికారి అమర్ నాథ్ రెడ్డి అన్నారు. ఖరీఫ్ సీజన్ లో సాగు చేసిన వరి పంటకు ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిందని క్వింటాల్ కు 2389 రూపాయలు చెల్లిస్తుందన్నారు. ధాన్యంలో 17శాతం తేమ శాతం ఉండాలని కొద్దిమేర ధాన్యాన్ని తీసుకొని సమీపం లోని రైతు సేవా కేంద్రానికి వెళ్లి ప్రేమ శాతం పరీక్షించుకొని అనంతరం కొనుగోలు చేస్తారన్నారు. డీసీఎంఎస్ ద్వారా వరి పంటను ప్రభుత్వ మద్దతు ధరతో కొనుగోలు చేస్తారన్నారు. మండలంలో దువ్వూరు, ఎర్రబల్లె గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉన్నాయన్నారు. బుధవారం మండల పరిధిలోని చిన్న సింగన పల్లె గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబిలో సాగు చేసిన మినుము, జొన్న, మొక్కజొన్న, వేరుశనగ, నువ్వులు, శనగ మరియు ఇతర పంటలను పంట నమోదు చేసుకోవాలన్నారు. వేరుశనగ సాగు చేసిన రైతులు ఎకరాకు 200 కేజీల జిప్సం వాడాలని 35 నుంచి 50 రోజుల పంట కాలంలో దీనిని వినియోగించుకోవాలన్నారు. స్థానిక వ్యవసాయ అధికారి కార్యాలయంలో 50 కేజీల జిప్సం ధర 180 రూపాయలకు అందుబాటులో ఉందని దీనిని రైతులు కొనుగోలు చేయవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సిబ్బంది నరసింహ, రైతులు పాల్గొన్నారు.




## ఎంపి మిథున్‌రెడ్డికి సమస్యల విన్నపాలు



మదనపల్లె, డిసెంబర్ 24 ప్రభాతవార్త :

రాజంపేట ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీకి చెందిన నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిస్సార్‌అహ్మద్, మాజీ ఎమ్మెల్యే దేశాయ్ తిప్పారెడ్డి, ఛైర్మెన్ మనూజలు సమస్యలను విన్నవించారు. బుధవారం తిరుపతి నుంచి బి.కొత్తకోటకు వెలుతున్న ఎంపి మిథున్‌రెడ్డిని బైపాస్ రోడ్డు మార్గంలో వీరు ఎంపిని కలసి ఘనస్వాగతం పలికారు. ఈసందర్భంగా ఎంపిపి శాలువ కప్పి పుష్పగుచ్ఛాలతో సన్మానించారు. అనంతరం నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను ఎంపి దృష్టికి తెచ్చారు. త్వరలోనే తాను మదనపల్లెలో పర్యటించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకొంటానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## పంటలకు గిట్టుబాటు ధర కల్పించడమే లక్ష్యం

ఏఎంసీ ఛైర్మన్ పురం రామ్మూర్తి


మాట్లాడుతున్న ఏఎంసీ ఛైర్మన్ పురం రామమూర్తి

పీలేరు డిసెంబర్ 24 ప్రభాతవార్త:

రైతు పండించిన పంటలను గిట్టుబాటు ధరలకు అమ్ముకునేందుకు వీలు కల్పించేందుకే రైతు బజారు నిర్మించనున్నట్లు ఏఎంసీ ఛైర్మన్ పురం రామమూర్తి తెలిపారు. బుధవారం పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణంలో ఏఎంసి కార్యదర్శి హరినాథ్ అధ్యక్షతన పాలకమండలి సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ఏఎంసీ ఛైర్మన్ పురం రామమూర్తి ముఖ్య అతిథిగా హాజహాజరై ఆయన అన్నారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు నియోజకవర్గ శాసన సభ్యులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ గౌరవాధ్యక్షులు నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు, రైతులు తాము పండించిన పంటలను గిట్టుబాటు ధరలకు విక్రయించుకోవడానికి అనుకూలంగా 1 కోటి 36 లక్షల రూపాయల వ్యయంతో రైతు బజారు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామని త్వరలో రైతు బజార్, రైతు మార్కెట్ యార్డ్ ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పి. సురేంద్ర రెడ్డి, డైరెక్టర్లు ఎన్, అమర్నాథ్ రెడ్డి, కలప రవి, గోళ్ళ కిషోర్ నాయుడు, ఎన్, సుబ్బయ్య, పి. రహమతుల్లా, ఎం. సాధన, లక్ష్మీకాంతమ్మ, జి. అనురాధ, ఓ. రమాదేవి, ఏ. అనిత, ఎం. రజనిశ్రీ, ఎస్. శివమ్మ, ఎం. కృష్ణమూర్తి, మార్కెట్ యార్డ్ సూపర్వైజర్ భగవాన్, సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా సింగ సాని గురు మోహన్ జన్మదిన వేడుకలు




బద్వేల్ అర్బన్, డిసెంబర్ 25 , ప్రభాతవార్త

బద్వేల్ పట్టణానికి చెందిన వైయస్సార్సీపి రాష్ట్ర కార్యదర్శి, మాజీ కూడా ఛైర్మన్ సింగసాని గురుమోహన్ వేడుకలు పట్టణంలోని నెల్లూరు రోడ్డులో గల రాఘవేంద్ర గ్రాండ్ ఫంక్షన్‌లో బుధవారం నిర్వహించారు. ఈ మేరకు ఆయన జన్మదిన వేడుకలను పండుగ వాతావరణంలో నిర్వహించి పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేసి పూలమాల, శాలవాలతో ఘనంగా సత్కరించడం జరిగింది. ఆయనకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో సాయి రాం దొడ్ల డైరీ కి చెందిన పాపిశెట్టి వీరాంజనేయులు (అంజి), 1వ వార్డు వైసిపి ఇన్చార్జి ఆవుల శ్రీనివాసులు, 35వ వార్డు ఇన్ చార్జీ బిజ్జం రమణయ్య, సింగసాని గురు మోహన్ (గురు) యాదవ సంఘం మాజీ అధ్యక్షులు రామన బోయిన శ్రీనివాసులు , ఏపీ ఆడిటర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గండికోట శివకుమార్, 34 వ వార్డు ఇంచార్జి పూనిపర్తి అనిల్ కుమార్ రాజులతోపాటు పెద్ది మెన్స్ వేర్ పెద్ది సుధాకర్, షేక్ దాదా పీర్ , గౌరీ సాయి రెస్టారెంట్ అండ్ బార్ యజమాని బ్రహ్మదేవుని యర్రం రెడ్డి, బయన బోయిన శివకుమార్, ప్రముఖ కాంట్రాక్టర్ సాన కత్తుల అశోక్, ఇరగబోయిన చంద్ర, రమణ, బాసికాల శ్రీనివాసులు శ్రీనివాసులు తోపాటు పలువురు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా పూలమాలతో ఘనంగా సత్కరించి అనంతరం ప్రత్యేక కేక్ కట్ చేపించి కేక్ తినిపించి వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు, వారికీ కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీ వెంకటేశ్వర స్వామి, అభయ ఆంజనేయ స్వామి ఆశీస్సులతో నిండు నూరేళ్ల సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని వారు ఆకాంక్షించారు. అలాగే పలువురు ఆయన స్వగృహానికి చేరుకుని ఆయన చేత కేక్ కట్ చేయించి ఆయనను సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అలాగే వారితోపాటు ఆర్యవైశ్య ప్రముఖులు ప్రముఖ వ్యాపారవేత మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ మాలేపాటి సునీల్ ,కుమార్ మునగ గోవిందు, ప్రైవేట్ ఇంజనీర్ తులసి సుమంత్ తదితర ప్రముఖులు ఉన్నారు.

## లక్ష్మీజనార్ధనస్వామి వారికి ధనుర్మాసం పూజలు

రామసముద్రం డిసెంబర్ 24 ప్రభాతవార్త



రామసముద్రం మండల కేంద్రంలో కొలువైన శ్రీ లక్ష్మీ జనార్ధన స్వామి ఆలయంలో బుదవారం ధనుర్మాసం సందర్భంగా 9వ రోజు స్వామివారిని ఆలయ ప్రధాన అర్చకులు పార్థ సారథి బటర్, కులశేఖర్ బటర్ వేకువ జామున శ్రీ వారిని సుప్రభాతం తో మేలుకొలిపి స్వామివారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి, పలు రకాల పుష్పాలతో స్వామిని అలంకరణ చేసి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ అర్చకులు భక్తులకు దర్శనం బాగ్యంకల్పించి తీర్థప్రసాదాలు వితరణ చేశారు.

## మదనపల్లె వన్ తనిఖీ చేసిన డిఎస్పీ




మదనపల్లె క్రైమ్, డిసెంబర్ 24 ప్రభాతవార్త.

నేరాల పట్ల పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని డిఎస్పి మహేంద్ర తెలిపారు. బుధవారం మదనపల్లె1వ పట్టణ పోలీస్‌స్టేషన్‌ను వార్షిక తనిఖీలలో భాగంగా ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొదట సిఐ మహమ్మద్ రఫీ, స్టేషన్ సిబ్బందితో గౌరవ వందనం స్వీకరించి, లోనికెళ్లారు. అన్ని రకాల రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమావేశమై రాత్రి గస్తీలను పెంచి, చోరీలు నేరాలు జరగకుండా, ప్రత్యేక దృష్టి సారించాలని డిఎస్పీ ఆదేశించారు.

## సిద్దవటం మండలాన్ని చీకట్లో నెట్టవద్దు

క్యాండిల్ ర్యాలీతో నిరసన తెలిపిన జేఏసీ నాయకులు

సిద్దవటం డిసెంబర్ 24 ప్రభాతవార్త

రాయచోటి కేంద్రంగా విలీనం చేసి సిద్దవటం మండలాన్ని చీకట్లో నెట్టవద్దని సిద్దవటంలో బుధవారం రాత్రి క్యాండిల్ ర్యాలీ నిర్వహించిన జేఏసీ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిద్దవటం మండల ప్రజల ఆకాంక్ష మేరకు జేఏసీ ఆధ్వర్యంలో గత 14 రోజుల నుంచి రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తున్నామన్నారు. 1807 నుండి 1812 వరకు జిల్లా కేంద్రంగా సిద్దవటం ఉండేదని తరచూ పెన్నానది ఉద్భతంగా పొంగి ప్రవహిస్తుండడం, బయటి ప్రపంచంతో సంబంధాలు తగ్గిపోతూ ఉండడంతో జిల్లా కేంద్రాన్ని కడపకు మార్చడం జరిగిందన్నారు. నాటి జిల్లా కేంద్రమైన సిద్దవటం ఒక చరిత్ర కలిగిందన్నారు. బడుగు బలహీన వర్గాలు, సన్న, చిన్న కారు రైతులు ఉన్నటువంటి అతి పేదరికమైన సిద్దవటం మండలాన్ని 2009 లో రాజంపేట నియోజకవర్గ పరిధిలో ఉన్నప్పటికీ కడప నగరానికి అత్యంత సమీపంలో ఉన్నందువలన కడప రెవిన్యూ డివిజన్ లో ఉండేదన్నారు. ప్రజలు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రైతులు ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకొని ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా ఎన్ని సంస్కరణలు చేసిన మండలాన్ని కడప జిల్లాలో కొనసాగిస్తూ వచ్చారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జిల్లాల పునర్వి భజనలో భాగంగా ప్రజాభిప్రాయం తీసుకోకుండా నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో సిద్దవటం మండలాన్ని అన్నమయ్య జిల్లా రాయచోటిలో విలీనం చేస్తున్నట్లు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడం చాలా బాధాకరమన్నారు. ఇదే అమలు జరిగితే ప్రజలు భవిష్యత్ తరాలకు అన్యాయం జరుగుతుందన్నారు. సిద్దవటం నుండి కడప కూతవేటు దూరంలో ఉందని ప్రభుత్వం స్పందించి సిద్దవటం మండలాన్ని కడపలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నేతలు, బండారు రాజగోపాలయ్య, పాలెం నారాయణ, పోలు వెంకటసుబ్బయ్య, బాలుగారి వెంకటసుబ్బయ్య, అయ్యవారు నాయుడు, కొట్టే రాజేష్, స్థానిక మహిళలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్స్ పనులను పరిశీలన

బ్రహ్మంగారిమఠం డిసెంబర్ 24 ప్రభాతవార్త



మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న సెంట్రల్ లైసెడ్ స్మార్ట్ కిచెన్స్ ను పరిశీలించిన జిల్లా నోడల్ అధికారి జోయల్ విజయ్ కుమార్, జిల్లా ఆర్డబ్ల్యూఎస్ శాఖ ఎస్ ఈ ఏడు కొండలు, డ్వామా పిడి ఆదిశేషారెడ్డి, ఎంపీడీవో రామచంద్రారెడ్డి,డి ఈ లు శివ రుద్ర గౌడ్, మధుసూదన్, ఏఈ లు వెంకటేష్, మురళి నాయకుడు పూజా శివ యాదవ్, లగాసాని గంగరాజు తదితరులు వున్నారు.

## శ్రీ చైతన్య హైస్కూల్‌లో ముందస్తు క్రిస్మస్ వేడుకలు



వేంపల్లె :డిసెంబర్:24 (ప్రభాత వార్త)

స్థానిక పట్టణంలోని శ్రీ చైతన్య హై స్కూల్ లో క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని ముందస్తు వేడుకలు విద్యార్థుల మధ్య ఆనందోత్సాహాలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం క్రిస్మస్ అలంకరణలతో పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. విద్యార్థులు సాంటా క్లాజ్ వేషధారణ, ఏంజెల్స్ వేషధారణలో పాల్గొని క్రిస్మస్ క్యారోల్స్ పాడుతూ, ఆటపాటలతో అలరించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ బి.చక్రపాణి రెడ్డి మాట్లాడుతూ క్రిస్మస్ గురించి వివరిస్తూ ప్రేమ, శాంతి, సహనము, సేవా భావం వంటి క్రిస్మస్ విలువలను విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్లు బి.చేతన్ రెడ్డి, చైతన్య రెడ్డి లు మాట్లాడుతూ పండుగలు విద్యార్థుల్లో సాంస్కృతిక విలువలు, ఐక్యతను పెంపొందిస్తాయని అన్నారు. విద్యార్థులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించగా, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారన్నారు.

## రాష్ట్రస్థాయి చెకుముక పోటీల్లో విద్యార్థులు

ఎడ్యుకేషన్ డిసెంబర్ 24 ప్రభాతవార్త:



రాష్ట్రస్థాయి చెకుముకి పోటీల్లో కడప జిల్లా శ్రీ సాయి విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు హర్షిత్ సాయి, రిషిత రామ్, చరణ్ రెండవ స్థానం సాధించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి శంషుద్దీన్ విద్యార్థులను అభినందిస్తూ, చిన్న వయసులోనే శాస్త్రీయ దృక్పథం ప్రదర్శించడం ప్రశంసనీయమన్నారు. ఈ విజయానికి పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయుల కృషి కారణమన్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనను పెంపొందిస్తున్న జన విజ్ఞాన వేదిక సేవలను ప్రత్యేకంగా ప్రశంసించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మైథిలి, అకాడమిక్ డైరెక్టర్ జితేంద్ర, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి శివ రాం కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా క్రిస్మస్ ముందస్తు సంబరాలు

రాజంపేట, డిసెంబర్ 24 ప్రభాతవార్త

రాజు విద్యాసంస్థలలో బుధవారం ముందస్తు క్రిస్మస్ సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన క్రిస్మస్ సంబరాలలో క్రీస్తుమార్గం అనుసరణీయమని రాజు హై స్కూల్ సీఈఓ గుంటిమడుగు రఘురామ రాజు, హెడ్ మాస్టర్ వి.మోహన్ రెడ్డి అకడమిక్ ఇంచార్జ్ వై.శేషారెడ్డి తెలిపారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచి తోటి వారిని ప్రేమించడం, దయా, క్షమా గుణాలను అలవర్చుకోవాలని తెలిపారు. అనంతరం క్రిస్మస్ కేక్ ను కట్ చేసి విద్యార్థులకు తినిపించి పండుగ సంతోషాన్ని పంచుకున్నారు. పలువురు విద్యార్థులు క్రిస్మస్ తాత వేషధారణతో అలరించారు. విద్యార్థులు క్రీస్తు జనన ఆవశ్యకతను తెలియచేశారు. ఈకార్యక్రమంలో బ్రాంచ్ 2 హెడ్ మాస్టర్ బాలగంగాధర్ నాయుడు, ఉపాధ్యాయులు సోనీ, ఫర్హాన, కృష్ణవేణి, గాయత్రి, జ్యోతి, రతిదేవి, రాజేశ్వరి, చంద్రకళ, మాలతి, చందన, నాగమణి, విద్యార్థులు పాల్గొన్నారు.


రాజు హైస్కూల్లో ముందస్తు క్రిస్మస్ సంబరాలలో విద్యార్థులు

## తాగునీటి పైపులైన్ పగిలిపోవడంతో నీరు వృధా

వేంపల్లె డిసెంబర్ 24 (ప్రభాత వార్త)

ఇడుపులపాయ పంచాయతీ లోని మారుతి నగర్ లో గత పది రోజులుగా తాగునీటి పైపులైను పగిలిపోవడంతో ఆ గ్రామ ప్రజలకు తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. గత పది రోజులుగా పంచాయతీ అధికారులకు , ఆ గ్రామ సర్పంచ్ కు తెలియజేసినా ఎవరూ కూడ పట్టించుకోవడం లేదని ఆ గ్రామ ప్రజలు వాపోతున్నారు. పంచాయతీ అధికారులు తక్షణమే స్పందించి అక్కడ పైపులైను లీకేజీలను వెంటనే మరమ్మత్తులు చేయాలని ఇడుపులపాయ జనసేన పార్టీ నాయకులు పోతిరెడ్డి చలపతి సూచించారు.